ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 29 జూన్ 2025 | 5









జూలై 1న సీఎం చంద్రబాబు కొవ్వూరు రాక

సీఎంవో నుంచి సమాచారం

ఏర్పాట్ల కోసం అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్

రాజమహేంద్రవరం/కొవ్వూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వచ్చే నెల 1న కొవ్వూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. చంద్రబాబు స్వయంగా ఒక కుటుంబానికి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ అందజేస్తారు. అదే సమయంలో పీ4 పథకం కింద మార్గదర్శి కోసం అక్కడ సభ నిర్వహిస్తారు. ఇదే మండలంలోని దొమ్మేరు లేదా కాపవరం, తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామాల్లో గ్రామ సభ ఉండే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను అప్రమత్తం చేశారు. శనివారం రాత్రి సీఎంవో నుంచి ముఖ్య కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, ముఖ్య మంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, కలెక్టర్ ప్రశాంతితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సీఎం ప్రోగ్రాం ఏర్పాట్లు, ఇతర అంశాలపై వారు దిశానిర్దేశం చేశారు. పెన్షన్ పంపిణీ, మార్గదర్శి కుటుంబాలతో ముఖాముఖీ, భద్రతా ఏర్పాట్లు, గ్రామసభ తదితర అంశాలపై రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. కాగా సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు శనివారం రాత్రి పలు ప్రాంతాల్లో పర్యటించారు. కొవ్వూరులోని వాత్సల్య వృద్ధాశ్రమాన్ని జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్డీవో రాణి సుస్మిత సందర్శించారు. అనంతరం దొమ్మేరు, మలకపల్లి గ్రామాల్లో సీఎం పర్యటనకు సంబంధించి కొన్ని స్థలాలను పరిశీలించారు.

పర్యాటక వెలుగు





టెంట్ సిటీ, బోట్ ఫెస్టివల్ (నమూనా చిత్రాలు)

ప్రకృతి అందాలకు.. సహజ సౌందర్యాలకు నెలవు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా. ఒకపక్క వయ్యారాలు పోతూ రారమ్మని పిలిచే గోదావరి.. మరోపక్క తనివి తీరని తీరం అందాలు.. వీటి నడుమ ఒంపుసొంపుల మడ అడవులు.. పచ్చని కొబ్బరి చెట్లు..మండువా లోగిళ్లు.. పంచా రామాల దివ్యక్షేత్రాలు.. ఇలా ఒకటేంటి ఉమ్మడి జిల్లా అందాలు వర్ణించడానికి మాటలు చాలవు.. ఇన్ని అందాలున్న ఉమ్మడి జిల్లాలో పర్యాటకుల తాకిడి ఇప్పటికీ అంతంతమాత్రమే. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పర్యాటకరంగానికి కొత్త కళ తెచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. తాజాగా రూ.737 కోట్లతో రెండు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోగా, పర్యాటకశాఖ తరపున బోట్ ఫెస్టివల్, బీచ్ ఫెస్టివల్, టెంట్ హౌస్‌లతో కట్టిపడేసేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది.

- ఉమ్మడి జిల్లాలో పర్యాటక, ఆతిథ్య రంగానికి కొత్త కళ
- సర్కారు శ్రద్ధతో హోటళ్లు, రిసార్టుల నిర్మాణానికి కంపెనీల రాక
- కోనసీమలో రూ.650 కోట్లతో తాజ్ చైతన్య సంస్థ రిసార్టులు, అమ్యూజ్‌మెంట్ పార్కు
- కాకినాడలో రూ.87 కోట్లతో తాజ్ ఎస్వీఎస్ సంస్థ హోటల్, కన్వెన్షన్ సెంటర్
- ప్రభుత్వంతో ఒప్పందాలు పూర్తి చేసుకున్న సంస్థలు
- అటు కాకినాడలో బీచ్ ఫెస్టివల్, కోనసీమలో బోట్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు
- రాజమహేంద్రవరంలో పర్యాటకులకు కొత్త అనుభూతి ఇచ్చేలా టెంట్ సిటీ

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

విశాఖ తర్వాత రాష్ట్రంలో పర్యాటకరంగానికి అత్యంత ఆదరణ ఉన్న జిల్లా ఉమ్మడి తూర్పు గోదావరి. కానీ గత వైసీపీ ప్రభుత్వం అరాచక పాలనతో పర్యాటక రంగం పూర్తిగా పడకేసింది. కొత్తగా సదుపాయాల కల్పన మాటేమోగానీ ఉన్న సదుపాయాలను గాలికి వదిలేయడంతో పూర్తిగా ఎక్కడికక్కడ పర్యాటక ప్రదేశాలు కొరగాకుండా పోయాయి. అటు పర్యాటక పెట్టుబడులు అయితే ఆ ప్రభుత్వ హయాంలో చిల్లిగవ్వ కూడా రాలేదు. ఈ నేపథ్యంలో గ్రహణం పట్టిన పర్యాటక రంగానికి కొత్త కళ తెచ్చేలా సీఎం చంద్రబాబు ఊపిరిలూదుతున్నారు. అద్భుత అవకాశాలున్న ఉమ్మడి జిల్లాలో పెట్టుబడులు ఆహ్వానిస్తూనే.. పర్యాటకులను అలరించేలా ప్రభుత్వం తరపున సైతం రకరకాల ఈవెంట్లను నిర్వహించేందుకు కార్యాచరణ చేపట్టారు. అందులో భాగంగా ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి రకరకాల ప్రోత్సాహకాలతో పెద్దపీట వేయాలని నిర్ణయించారు. ఈమేరకు ముందుకు వచ్చిన కంపెనీలతో అమరావతిలో శుక్రవారం నిర్వహించిన పర్యాటక సదస్సులో ప్రభుత్వంతో ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు రూ.737 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ప్రధానంగా కోనసీమ జిల్లాలో రూ.650 కోట్ల పర్యాటక పెట్టుబడులు పెట్టడానికి తాజ్‌చైతన్య ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ముందుకు వచ్చింది. ఆ సంస్థ శుక్రవారం పర్యాటక శాఖతో ఒప్పంద పత్రాలు మార్చుకుంది. ఈ పెట్టుబడులతో అమలాపురం, చుట్టుపక్క ప్రాంతాల్లో రిసార్టులు, అమ్యూజ్‌మెంట్‌పార్కు నిర్మించనున్నట్టు ఒప్పంద పత్రాల్లో పేర్కొన్నారు. వాస్తవానికి కేరళ తరహాలో ఉండే కోనసీమ అందాలు చూసేందుకు ఎందరో పర్యాటకులు ఇక్కడకు వస్తున్నారు. కానీ సరైన స్టార్ హోటళ్లు, ఎంటర్‌టైన్‌మెంట్ లేదు. ఈ నేపథ్యంలో వీటిని అందుబాటులోకి తీసుకురావడానికి తాజ్ చైతన్య ఇన్‌ఫ్రా కంపెనీ ముందుకు వచ్చింది. ఈ సదుపాయాలు అందుబాటులోకి వస్తే సుదూర ప్రాంతాల నుంచి కోనసీమకు వచ్చే పర్యాటకులు కొన్నిరోజులు ఇక్కడే గడుపుతారని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా రకరకాల వ్యాపార లావాదేవీలకు ఊతం అందడంతోపాటు స్థానికులకు సైతం ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే కాకినాడలో రూ.87 కోట్లతో స్టార్‌హోటల్ గదులు, వాటితో పాటు భారీ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి తాజ్ ఎస్వీఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం కాకినాడలో స్టార్‌హోటళ్ల సంఖ్య చాలా తక్కువగా ఉన్నాయి. అటు భారీ ఈవెంట్ల నిర్వహణకు సరైన కన్వెన్షన్ సెంటర్ లేదు. ఈ నేప థ్యంలో హైదరాబాద్ హైటెక్స్ తరహాలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ఆ కంపెనీ ముందుకు వచ్చింది. కోనసీమలో నిర్మించే రిసార్టులు, అమ్యూజ్‌మెంట్ పార్కు ద్వారా వెయ్యి మందికి, కాకినాడలో నిర్మించే హోటల్, కన్వెన్షన్ సెంటర్ ద్వారా 500 మందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి. అలాగే ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 13 చోట్ల గోదావరి తీరం, గోదావరి కాలువల వెంబడి అడ్వంచర్ టూరిజం సదుపాయాలకు ప్రైవేటు కంపెనీల నుంచి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది.

అటు టెంట్ సిటీ.. ఇటు పండగలు..

ఒకపక్క పెట్టుబడులు రాబట్టి ఉమ్మడి జిల్లాలో పర్యాటక సదుపాయాలు, ఆహ్లాదం పెంచడం ఒకెత్తుకాగా, పర్యాటకశాఖ తరపున సైతం ప్రభుత్వం పలు టూరిస్టు కార్యకలాపాలు నిర్వహించాలని నిర్ణయించింది. అందులోభాగంగా త్వరలో కోనసీమ జిల్లాలో గోదావరి బోట్ ఫెస్టివల్ నిర్వహించబోతోంది. వందలాది బోట్లకు పడవ పోటీలు, అందులో సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి క్యాలెండర్ రూపొందించింది. అలాగే కాకినాడ బీచ్ ఫెస్టివల్‌ను మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. ఫుడ్ ఫెస్టివల్, గేమ్స్, సాహస జలక్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యూజికల్ నైట్స్ వంటివి ఏర్పాటుచేయబోతోంది. అలాగే దిండిలో హౌస్‌బోట్స్, ఫ్లోటింగ్ రెస్టారెంట్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. నదిలో తిరుగుతూ, ఒకచోట ఆగుతూ అందులో కుటుంబంతో కలిసి డిన్నర్, లంచ్ చేసేలా ఆధునిక, విలాసవంతమైన బోట్లను రప్పిస్తోంది. ఇదికాకుండా 12 మంది పర్యాటకులు కూర్చుని ప్రయాణించేలా హైస్పీడ్ ఎఫ్ఆర్‌పీ బోట్ క్రూయిజ్‌ను నది, సముద్రంలో తిప్పడానికి వీలుగా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇదంతా ఒకెత్తయితే రాజమహేంద్రవరం నగరంలో గోదావరి తీరాన 40 గదులతో టెంట్ సిటీని ఏర్పాటు చేయబోతోంది. సాధారణంగా ఇక్కడకు వచ్చే పర్యాటకులు గోదావరికి దూరంగా ఎక్కడో హోటళ్లలో బస చేస్తారు. ఇందుకు వేలల్లో ఖర్చవుతుంది. మరోపక్క రద్దీ రోజుల్లో హోటల్ గదులు కూడా దొరకవు. ఈనేపథ్యంలో తక్కువ ఖర్చు.. ఎక్కువ గోదావరి అందాలు చూసేలా 40 గదులు నిర్మించాలని ప్రతిపాదించింది. ఇందులో పడక గదులు, వాష్‌రూంలు, ఎంటర్‌టైన్‌మెంట్ కూడా అందుబాటులో ఉంటుంది. వాస్తవానికి ఈటెంట్ సిటీ అయోధ్య, గుజరాత్‌లోని కెవాడియా ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందాయి. దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు అక్కడి పర్యాటక శాఖ ఈటెంట్ సిటీల్లో బస అందుబాటులోకి తీసుకువచ్చింది. దీన్ని అధ్యయనం చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ వద్ద రూ.98 కోట్లతో 50 టెంట్ రూం సిటీని ఏర్పాటుకు నిర్ణయించింది. పర్యాటకులకు తక్కువ ధరల్లో అన్ని రకాల వసతులతో వీటిని ఇవ్వబోతోంది. అచ్చం ఇదే తరహాలో రాజమహేంద్రవరంలో కూడా ఈ తరహా టెంట్ సిటీని ఏర్పాటుచేయాలని నిర్ణయించింది.

'ధర' హాసం!

అరటితోపాటు కొబ్బరి మార్కెట్ ధరలు అనూహ్యంగా పుంజుకోవడంతో రైతుల ఆనందానికి అవధుల్లేవు. కర్పూర అరటి ధర గతంకంటే రెట్టింపు పలుకుతుండడం, ఆ రకం కర్పూర సాగు చేసిన రైతులకు పంట పండినట్టయింది. అలాగే కొబ్బరిలో కూడా ధరల పెరుగుదల రానున్న రోజుల్లో మరింత పుంజుకోవచ్చని అంచనా. ఇక కురిడీ కాయకు అద్భుత ధర పలుకుతోంది.

- అరటి, కొబ్బరి రైతుల్లో ఆనందం
- కర్పూర, చక్రకేళీ గెల రూ.600 పైనే
- ఉత్పత్తి తగ్గడంతో పెరిగిన డిమాండ్
- కొబ్బరికీ రికార్డు స్థాయిలో పెరుగుదల
- కురిడీ వెయ్యింటికీ రూ.27 వేలు
- పచ్చికాయ మాత్రం రూ.19వేల లోపే

(అమలాపురం- ఆంధ్రజ్యోతి)

కర్పూర.. గతంకంటే రెట్టింపు

ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని గోదావరి నదీ పరీవాహక లంక గ్రామాల్లో అరటి సేద్యం చేస్తున్న రైతులకు ఈసారి పంట పండినట్టయింది. రావులపాలెం అరటి మార్కెట్ నుంచి నిత్యం వేలాది కర్పూర, చక్రకేళీ సహా వివిధ రకాల అరటి ఉత్పత్తులు వివిధ రాష్ట్రాలతోపాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. ప్రస్తుతం కర్పూర రకానికి మంచి డిమాండ్ ఉంది. ఈ ఏడాది జనవరిలో కర్పూర అరటి గెల రూ.120 నుంచి రూ.250 వరకు ధర పలికింది. మే, జూన్ నెలలో కర్పూర రకం గెల ఒక్కోటీ రూ.300 నుంచి రూ.600 వరకు ధర పలుకుతుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. చక్రకేళీ కంటే కర్పూర రకానికే ధర పెరిగింది. గతంలో కర్పూర రకానికి మార్కెట్ పూర్తిగా పడిపోవడంతో రైతులు ఆ రకం పంటపై పెద్దగా దృష్టిపెట్టలేదు. దాంతో సాగు తగ్గిపోయింది. ఈ కారణంగా కర్పూరానికి డిమాండ్ పెరిగింది. రావులపాలెం మార్కెట్ నుంచి నెలకు 7వేల నుంచి 8,500 వరకు అరటి గెలలు ఎగుమతి అయ్యేవి. జనవరి నెలలో మార్కెట్‌యార్డు నుంచి 9 వేల నుంచి 10 వేల వరకు అరటిగెలల విక్రయాలు జరిగేవి. ప్రస్తుతం కర్పూర రకం వినియోగం పెరగడంతో ఒడిశా, విశాఖపట్నం, హైదరాబాద్, ఖమ్మం వంటి ప్రాంతాలకు అరటి ఎగుమతులు పెరిగాయి. చక్రకేళీ అరటిగెల ప్రస్తుతం రూ.400 నుంచి రూ.700 వరకు ధర పెరగడంతో రైతులకు లాభసాటిగా మారింది. రానున్న శ్రావణ మాసం, వినాయకచవితి, పండుగల సీజన్‌లో మరింత ధరలు పెరిగే అవకాశం ఉంది.

రికార్డు స్థాయిలో కురిడీ ధరలు

కొబ్బరి రైతులకు ఈసారి దశ తిరిగిందనే చెప్పాలి. ధరల పెరుగుదల కొనసాగుతుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. దీనికితోడు నిల్వచేసిన కురిడీ కొబ్బరి ధరలు వెయ్యింటికీ రూ.27వేల వరకు ధర పలకడం రికార్డు నెలకొల్పింది. ప్రధానంగా ఇతర రాష్ట్రాల్లో కొబ్బరి ఉత్పత్తులు తగ్గిపోతుండడంతో గోదావరి జిల్లాల నుంచి ఎగుమతి అయ్యే ఉత్పత్తులకు మంచి డిమాండ్ లభిస్తోంది. పచ్చికాయ కొబ్బరి ధర వెయ్యి కాయ మాత్రం రూ.18వేల నుంచి రూ.19 వేల వరకు ధర పలుకుతున్నట్టు కొబ్బరి రైతులు చెబుతున్నారు. రానున్న శ్రావణమాసం, వినాయక చవితి వంటి పర్వదినాల సమయంలో వీటి ధరలు పెరుగుతాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా గోదావరి జిల్లాల నుంచి 50 లారీలకు పైగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలకు ఎగుమతులు అవుతున్నాయి. అయితే గతంకంటే ప్రస్తుతం కోనసీమ జిల్లాలో కొబ్బరి ఉత్పత్తులు ధరలు పెరిగినప్పటికీ ఉత్పత్తులు మాత్రం తగ్గుముఖం పట్టడం రైతులను ఒకింత నిరాశకు గురిచేస్తోంది. ప్రస్తుతం కొత్త కొబ్బరి క్వింటాల్ రూ.23,500, రెండో రకం కొత్తకొబ్బరి రూ.20 వేలు, కురిడీ కొబ్బరి పాతరకంలో గండేరా వెయ్యి కాయ రూ.27 వేలు, గటగటా వెయ్యి రూ.25 వేలు,కురిడీ కొబ్బరి కొత్తరకంలో గండేరా వెయ్యికాయ రూ.25వేలు, గటగటా వెయ్యి రూ.23 వేలు ధర పలుకుతున్నాయి. నీటికాయ రూ. 18 వేల నుంచి రూ.19వేల మధ్య ధర పలుకుతోంది. మొత్తం మీద అరటి, కొబ్బరి ధరల పెరుగుదల రైతుల్లో ఉత్సాహాన్ని నింపింది.

అంతర్వేదిలో ముందుకొచ్చిన సముద్రం



అంతర్వేది సాగర సంగమం వద్ద సముద్రం ముందుకు రావడంతో పాత లైట్‌హౌస్ దిమ్మను చేరుకున్న కెరటాలు

అంతర్వేది, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అంతర్వేది సాగర సంగమం వద్ద ఉన్న పాత లైట్‌హౌస్ దిమ్మవద్దకు సముద్ర కెరటాలు చొచ్చుకు వచ్చాయి. కొంతకాలంగా ఒడ్డున ఉన్న లైట్‌హౌస్ దిమ్మ సముద్రపు కోతకు గురి కావడంతో కెరటాల మధ్య ఉంది. సాగర సంగమంవద్ద లైట్‌హౌస్ దిమ్మ ప్రమాద భరితంగా ఉండడంతో పర్యాటకులు ఫొటోలు తీసుకునేందుకుగానీ ప్రయత్నిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కెరటాలు ఉధృతంగా రావడంతో సముద్రపు నీరు ముందుకు చొచ్చుకు వచ్చి తీరప్రాంతం కోతకు గురవుతోంది.

కాంగ్రెస్ పార్టీ పునర్వైభవానికి సైనికుల్లా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి

- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం
- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పిలుపు
- అమలాపురంలో సభకు భారీగా హాజరైన పార్టీ నేతలు, కార్యకర్తలు

అమలాపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేసి పార్టీని గ్రామస్థాయిలో పటిష్ఠం చేయాలని పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆమె సుదీర్ఘంగా ప్రసంగించి దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ కమిటీలో ఉన్న సభ్యులతోపాటు అభిమానులు కూడా వారానికి రెండురోజులు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా వారి మద్దతును కూడగట్టే ప్రయత్నంలో సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ప్రతిజ కరూ తాను పాదయాత్ర చేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని కోరుకుంటున్నారని, షర్మిల వచ్చింది, పాదయాత్ర చేసింది, వెళ్లింది అనే రీతిన తాను చేపట్టే పాదయాత్ర ఉండకూడదని, ప్రజల నుంచి గ్రౌండ్ లెవల్‌లో పార్టీని బలోపేతం చేసిన నాడే ప్రజల మధ్యకు వారు ఎదుర్కొనే సమస్యలతో తాను పాదయాత్ర చేస్తే అర్థం ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం దీన స్థితిలో ఉందని, దీన్ని కాపాడుకుని ప్రధానమంత్రిగా రాహుల్‌గాంధీని చేయాలనే తలంపుతో కాంగ్రెస్ నేతలంతా కంకణ బద్ధులై పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించడం ద్వారా కాంగ్రెస్‌ను వారికి చేరువ చేసేందుకు బూత్ కమిటీల్లో ఉన్న కాంగ్రెస్ పెద్దలంతా కష్టించి పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం పనిచేసేవారిని కాంగ్రెస్ అధిష్ఠానం తప్పక గుర్తిస్తుందన్నారు. మరో అతిథిగా పాల్గొన్న ఏఐసీసీ ఆహ్వానకమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోను పర్యటించి పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ప్రజా సమస్యలపై పోరాటాల ద్వారా వారి మద్దతును కూడగట్టి పార్టీని బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సభకు అధ్యక్షత వహించిన డీసీసీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న పోరాటాలను వివరించారు. రానున్న రోజుల్లో ప్రజా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ మాట్లాడుతూ తాను కాంగ్రెస్ పార్టీ ఎంపీగా ఉన్న పదేళ్ల కాలంలో కోనసీమ అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. మాజీ కేంద్రమంత్రి ఎంఎం. పల్లంరాజు, ఏఐసీసీ కార్యదర్శి పాలికవర్మ, పీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, పెన్మెత్స జగ్గప్పరాజు, కామన ప్రభాకరరావు, చీకట్ల అబ్బాయి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు అయితాబత్తుల సుభాషిణి, పాలెపు ధర్మారావు, కోట శ్రీనివాసరావు, రౌతు ఈశ్వరరావు, బీఆర్కే నాయుడు, కొత్తూరి శ్రీనివాస్, వంటెద్దు బాబి, యార్లగడ్డ రవీంద్ర, కుడుపూడి శ్రీను, పేరిశర్మ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



వాడపల్లి వెంకన్న ఆలయంలో కూచిపూడి నృత్యప్రదర్శన చేస్తున్న చిన్నారి

6

జైల్లో పరిచయమై.. బెయిల్‌పై బయటకు వచ్చి..

యథేచ్ఛగా నేరాలు



చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ

- కాకినాడలో ముగ్గురు అంతర్ జిల్లాల నేరస్థుల అరెస్టు
- రూ.65లక్షల విలువ చేసే చోరీ సొత్తు స్వాధీనం

7

జిల్లాలో సర్క్యూట్ దేవాలయ టూరిజం అభివృద్ధికి యోచన

- కలెక్టర్ మహేష్‌కుమార్

మామిడికుదురు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సర్క్యూట్ దేవాలయ టూరిజంను ప్రసాద్ స్కీమ్ కింద అమలు చేసేందుకు యోచన చేస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. మామిడికుదురు మండలం పాశర్లపూడి వైనతేయ గోదావరి తీరంలో ఉన్న టూరిజానికి చెందిన రిసార్ట్‌ను కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నదీ పరివాహక ప్రాంతంలో ఆహ్లాదకరంగా ఉండేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరిచేలా స్థల సేకరణ చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే కొంతమేర స్థలాన్ని కేటాయించామని, ప్రైవేటు వ్యక్తుల నుంచి తీసుకునే స్థలాన్ని ఆయన పరిశీలించారు. గోదావరి నదీ తీరంలో రిసార్ట్ పక్కనే మరికొంత స్థలాన్ని తీసుకుని పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరుస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట అమలాపురం ఆర్డీవో కె.మాధవి, తహశీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో భవానీ, వీఆర్వోలు నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో రాజోలు ఎంపీపీ మృతి 7

కోలాటం.. సంప్రదాయ జానపద నృత్యకళ 6

చోరీ కేసులో నలుగురి అరెస్టు 7

ఈవీఎంల గోదామును పరిశీలించిన కలెక్టర్



ఈవీఎంలను భద్రపరిచిన గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ముమ్మిడివరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్లను భద్రపరిచిన గోదాముకు పటిష్ఠ భద్రత కల్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్లను గోదామును గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల స్థితిగతులను పరిశీలించి భద్రతకు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పటిష్ఠ భద్రత, నిఘా ఏర్పాటు చేశామని, అనునిత్యం రెవెన్యూ, ఎన్నికల సిబ్బంది, అగ్నిమాపక, పోలీసుశాఖలు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పర్యవేక్షణ రిజిస్టర్‌లో జిల్లా కలెక్టర్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతకం చేశారు. ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న జిల్లా ఎన్నికల గోదామును ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను అందించామన్నారు. గోదామువద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణలో పటిష్ఠ నిఘా ఉంచాలన్నారు. ప్రతినెలసాధారణ తనిఖీలు నిర్వహించడంతోపాటు మూడు మాసాలకోసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గోదాములోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్ర పరికరాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున వడ్డి నాగేశ్వరరావు(కాంగ్రెస్), టీడీపీ తరపున దొమ్మేటి రమణ కుమార్, డీఆర్వో రాజకుమారి, ఉపతహశీల్దార్ శివరాజు, వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.



తిరుమల గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో కోలాటం ప్రదర్శన ఇస్తున్న బండారులంక శ్రీనివాసా కోలాటబృందం

కోలాటం..
సాంప్రదాయ జానపద నృత్యకళ

కోలాటం ప్రదర్శన జరుగుతుందంటే అటుగా వెళ్లేవారు ఆగి మరీ చూస్తారు. ఆరోహణ అవరోహణ క్రమంలో కోలాట ప్రదర్శన జరుగుతున్నప్పుడు కళాభిమానులు తమకు తెలియకుండానే నిలబడ్డ చోటు నుంచే పదం.. పాదం కదుపుతూ తాళం వేస్తుంటారు. శతాబ్ధాల చరిత్ర కలిగిన కోలాట ప్రదర్శన నేడు ప్రధాన ఆలయాల్లోనే కాదు పండుగలు, ఇతర దేవతామూర్తుల వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. గురువుల సమక్షంలో గజ్జ పూజచేస్తే గానీ కోలాటం శిక్షణ పూర్తి చేసుకున్నవారు ప్రదర్శన ఇచ్చే అవకాశం లేదు. కోలాటం అనేది సాంప్రదాయ జానపథ నృత్యరూపకం.

- తిరుమల బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేకం
- బండారులంక కోలాటబృందం ప్రత్యేక ఆకర్షణ



గజ్జ పూజ నిర్వహిస్తున్న గురువు

లయబద్ధంగా కోలాటం..

అమలాపురంరూరల్, జూన్28(ఆంధ్రజ్యోతి): లయబద్ధంగా కోలాటం జరుగుతుంటే హృదయం కూడా అంతే లయబద్ధంగా స్పందిస్తోంది. కోల అంటే కర్ర. ఆట అంటే నృత్యమని అదే కోలాటమంటారు. ఇటీవల కాలంలో వయోబేధం, లింగబేధం లేకుండా కోలాటం నేర్చుకోవాలన్న తపన అంతకంతకూ పెరుగుతుంది. అందుకు అనుగుణంగా గురువులు ప్రత్యేక శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తూ శిక్షణ ఇస్తున్నారు. రెండు చేతులతో కర్రలు పట్టుకుని గుండ్రంగా తిరుగుతూ లయబద్ధంగా అడుగులు వేస్తూ ఒకరి కర్రను మరొకరు తాకిస్తూ కళాకారులు అద్భుతంగా ప్రదర్శన ఇస్తే చూసేందుకు రెండు కళ్లు చాలవు. సమూహంగా చేసే ఈ నృత్య ప్రదర్శనలో పాటలకు ప్రత్యేక స్థానం ఉంది.

పురంధరదాసు కీర్తనలు ప్రత్యేకం

కోలాటం చేసే బృందానికి ప్రత్యేకమైన డ్రెస్ కోడ్ ఉంటుంది. సాంప్రదాయ బద్ధమైన దుస్తులతోపాటు మహిళలు, బాలికలు ఆభరణాలు ధరించి కోలాటం ప్రదర్శన చేస్తుంటారు. గోవింద హరి గోవింద.. నల్లనల్ల కృష్ణయ్యా, విట్టలవిట్టల గోవింద అంటూ పురంధరదాసు ఆలపించిన కీర్తనలతోపాటు అన్నమాచార్య కీర్తనలను గురువు ఆలపిస్తుండగా లయబద్ధంగా కోలాట ప్రదర్శన జరుగుతుంది. కాలంతో పాటు కోలాటం ప్రదర్శనలోను ఎన్నో మార్పులు వచ్చాయి. ఎవరి సాంప్రదాయాలకు అనుగుణంగా వారు కోలాటం ప్రదర్శనకు ప్రత్యేక పాటలను వారే రచించుకుంటూ వారి వారి పండుగల్లో ప్రదర్శనలు ఇస్తుండడం ప్రధానంగా దేవీ నవరాత్రుల సమయాల్లో చూస్తుంటాం. అంతేకాకుండా కోలాటంలో వాయిద్యాలు వాయిస్తూ ప్రత్యేకమైన పాటలు పాడుతూ చేసే నృత్యం సైతం పలువురిని ఆకట్టుకుంటుంది. సాంప్రదాయబద్ధమైన కోలాట బృందానికే ప్రత్యేక స్థానం అని చెప్పవచ్చు. కోలాటం పిల్లల నుంచి పెద్దల వరకు, పండితుల నుంచి పామరుల వరకు అన్నివర్గాల వారిని అలరించే కళారూపకంగా చెప్పవచ్చు.

తిరుమల బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేకం

బండారులంక గ్రామంలో కాల్దరి గ్రామానికి చెందిన ఏటూరి రామకృష్ణ ఆధ్వర్యంలో ఇప్పటికే ఎందరో కోలాటం శిక్షణ పొందారు ఇటీవల తిరుపతి గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలతోపాటు అప్పలాయగుంట ఆలయాలవద్ద బండారులంకకు చెందిన 50 మంది కోలాటం బృందం ప్రదర్శన ఇచ్చారు. అదేవిధంగా చింతలో నూకాలింకాలయం, కోట రాజగోపాల స్వామి ఆలయం, నగరం పట్టాభిరామ ఆలయంలో శ్రీశ్రీనివాసా భజన మండలి పేరిట పలు ప్రదర్శనలు ఇచ్చినట్టు బాలమిత్ర సంఘం వ్యవస్థాపకుడు చింతపట్ల బాబు తెలిపారు. బండారులంక పరిసర ప్రాంతాల్లో జరిగే ఉత్సవాల్లో సైతం ఈ బృందం ప్రత్యేక ప్రదర్శనలు ఇస్తోంది.

కొత్త బంగారు లోకం.. మీకు కావాలి సొంతం..



పాఠశాల చదువు అయిపోయింది. బడిబాటను వీడి.. కాలేజీ వైపు పయనం మొదలైంది. నూతన పరిచయాలు, స్నేహాలు, సరికొత్త ఆలోచనలు.. ఇప్పుడిప్పుడే కాలేజీలో అడుగు పెట్టే విద్యార్థులకు అన్నీ కొత్తగా, వింతగా 'హ్యాపీడేస్'లా అనిపిస్తాయి. ఇంటర్ విద్యార్థులకు ఇదో కొత్త అనుభవం. విద్యార్థుల జీవితాల్లో ఇంటర్ విద్య అత్యంత కీలకమైనది. ఇక్కడి నుంచే వారి భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయి. అంతేకాదు.. జీవితాన్ని తలకిందులు చేసే సమయం కూడా ఇదే. ఇప్పుడిప్పుడే ఇంటర్ కాలేజీల్లో చేరుతున్న వారు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వీరిపై ఓ కన్నేసి ఉంచాలి. అప్పుడే పిల్లల భవిష్యత్తు కొత్త బంగారు లోకమై వెలుగుతుంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

స్కూల్ లైఫ్‌కు ఫుల్‌స్టాప్ పడింది. కాలేజీ లైఫ్ మొదలైంది.. పదో తరగతి పరీక్షల్లో విజయం సాధించామనే ఆనందం.. కళాశాలల్లో చేరామన్న ఉత్సాహం ప్రతి ఇంటర్ విద్యార్థిలో కనిపిస్తుంటుంది. కొత్త, కొత్త పరిచయాలు, కాలేజీ వాతావరణం కలిగించే ఆనందం ఇలా అన్నీ సరికొత్త అనుభూతిని ఇస్తాయి. ఈ ఇంటర్ విద్యే ప్రతి విద్యార్థి జీవిత గమనాన్ని నిర్ణయిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. చక్కగా చదివి గట్టెక్కితేనే ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుంది. ఏ మాత్రం అశ్రద్ధ కొరవడినా జీవితం గాడి తప్పినట్టే.. సినిమాల ప్రభావం, స్నేహితులే లోకంగా గడిపే సందర్భాలు ఇక్కడ సాధారణంగా కనిపిస్తుంటాయి. ఇదే సమయంలో స్నేహితులకు, అనవసర విషయాలకు అధిక ప్రాధాన్యమిచ్చి.. తల్లిదండ్రులు, అధ్యాపకులను నిర్లక్ష్యం చేస్తూ ఎక్కువమంది విద్యార్థులు ఉంటారు. ఈ సమయంలో ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో అడుగులు వేస్తే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోగలమనే విషయాన్ని ప్రతి ఇంటర్ విద్యార్థి గుర్తుంచుకోవాలి.

- చదువుపై దృష్టిపెడితే అన్నీ 'హ్యాపీడేస్..'
- వ్యసనాలకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారమే
- తల్లిదండ్రులూ పిల్లలను గమనించాలి
- భవిష్యత్తుకు బంగారు బాట వేసుకునే దశ 'ఇంటరే'

ఎప్పటికప్పుడు నోట్స్..

ఇంటర్‌లో ప్రతి విద్యార్థి చదువుకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. స్కూల్‌లో పాఠ్యాంశాలకు, కాలేజీ పాఠ్యాంశాలకు మధ్య వ్యత్యాసం చాలా కనిపిస్తుంది. విధిగా తరగతులకు హాజరుకావడం, పాఠ్యాంశాలపై దృష్టిసారించాలి. అధ్యాపకులు ఇచ్చే నోట్స్‌ను ఎప్పటికప్పుడు చక్కగా రాసుకోవాలి. ముఖ్యంగా వారాంతపు పరీక్షలు నిర్వహిస్తే వాటిలో మంచి మార్కులు వచ్చేలా సాధన చేయాలి. సెలవు రోజులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. అలా చేస్తే విద్యార్థి ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించగలరు. క్రీడలు, లైబ్రరీలో పుస్తక పఠనం, స్నేహితులతో సబ్జెక్టులపై చర్చ, వినోదం వంటివి ఆహ్లాదంతో పాటు జీవితాన్ని ఆనందమయం చేస్తాయి.

చెడు వ్యసనాలు వద్దు..

జీవితాన్ని మలుపు తిప్పే ప్రమాదకరమైన చెడు వ్యసనాలు ఈదశలోనే ఎక్కువగా అలవాటు అవుతాయి. ముఖ్యంగా వాటి బారిన పడకూడదు. పడితే అంతే సంగతులు. అందుకే సిగరెట్, గుట్కాలు, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలి. ఇక అశ్లీలత అంశాలపై దృష్టి పెట్టినా, వేడుకల పేరుతో స్నేహితులు చెడు దారుల వైపు ప్రేరేపించినా వాటి జోలికి అస్సలు వెళ్లకూడదు. కాలేజీలు ఎగ్గొట్టి తిరిగే దశ కూడా ఇదే. ఈ సమయంలోనే విద్యార్థులు అల్లరిచిల్లరగా తిరిగేందుకు చూస్తుంటారు. స్నేహితుల ప్రభావం ఇలాంటి సందర్భంలో అధికంగా ఉంటుంది. మంచి భావాలున్న వారితో స్నేహం చేస్తే అంతా బాగుంటుంది. చదువుపై ఇష్టం, పెద్దలపై గౌరవం, సమాజంపై అవగాహన, అధ్యాపకులపై సదాభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి.

లక్ష్యం వైపు అడుగులు..

మీ ప్రయాణం ఎప్పుడూ భవిష్యత్తులో ఉండే లక్ష్యం వైపు ఉండాలి. ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ తదితర ఏ కోర్సుకైనా తొలి అడుగు పడాల్సింది ఇంటర్లోనే. కొత్తకొత్త స్నేహదనంతో నిండి కళాశాల జీవితం సక్రమంగా సాగితే ఒక బంగారులోకమవుతుంది. తప్పటడుగులు వేస్తే అధోగతి పాలవుతుంది. అలా లక్ష్యాన్ని నిర్ణయించుకుని ముందుకు సాగాలి. దీని కోసం రోజూ కొంత సమయం కేటాయించాలి. మీరు డాక్టర్ కావాలనుకుంటే.. రోజూ కొంత సమయం దానికి సంబంధించిన పుస్తకాలు చదవడం లేదా వీడియోలు చూడడం లాంటివి చూడాలి. ఇంజనీర్ కావాలనుకుంటే దానికి ఆ సబ్జెకులకు సంబంధించిన అంశాలపై దృష్టిపెట్టాలి. కెరియర్‌లో మీకంటే సీనియర్లతో మాట్లాడాలి. సబ్జెక్టుల్లో అనుమానాలు ఉంటే లెక్చరర్లను సంప్రదించాలి. మొత్తానికి ప్రణాళికాబద్ధంగా చదువుకుంటేనే భవిష్యత్తులో మీరు లక్ష్యాన్ని చేరుకోగలుగుతారు.

బరువు తగ్గితే.. 'బ్యాగు'ంటుంది..

- పుస్తకాల సంచి విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి..
- చిన్నారుల వెన్నెముకపై ప్రభావం చూపే ప్రమాదం
- తల్లిదండ్రులూ జాగ్రత్తలు తీసుకోండి.



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

బండి గంటలు మోగాయి. బండెడు పుస్తకాలు.. బరువైన బ్యాగులతో పిల్లలు బడిబాట పడుతున్నారు. తమ పిల్లాడి బ్యాగు నిండా పుస్తకాలు చూసి.. అబ్బో! స్కూల్లో చాలా గట్టిగా పాఠాలు చెబుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు మురిసిపోతుంటారు. పిల్లల వీపుపై కిలోల కొద్దీ బరువైన స్కూల్ బ్యాగ్ మోయించడం సబబు కాదంటున్నారు వైద్య నిపుణులు. పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందంటున్నారు.

'భారం' కాకుండా..

చిన్నారులకు విద్య 'భారం' కాకూడదు. చదువులు 'బరువు'గా వారు ఫీల్ కాకూడదు. చాలా మంది విద్యార్థి మోసే బ్యాగ్ బరువును బట్టి అతడి చదువును అంచనా వేస్తారు. పిల్లలు బయటకు చెప్పలేని ఆ భారాన్ని మోస్తూ అనారోగ్యాలు కొని తెచ్చుకుంటారు. పిల్లలు ఆరోగ్యం కోసం శ్రద్ధ చూపే తల్లిదండ్రులు స్కూల్ బ్యాగ్ బరువు విషయంలో కూడా కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల్ని స్కూల్‌కు పంపేటప్పుడు అవసరమైన పుస్తకాలతోనే పంపాలి.

ప్రైవేటు మరీను..

ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులకు 'బరువు' బాధ్యతలు అధికం. చదువుల పేరుతో ఈ స్కూళ్లల్లో పుస్తకాలను అధికంగా కొనిపిస్తుంటారు. స్కూళ్లల్లో రెగ్యులర్ సిలబస్‌తోపాటు అసైన్‌మెంట్, ప్రాజెక్టులు, స్లిప్ టెస్టులు, క్లాస్ వర్క్, హోం వర్కు, రఫ్ కాపీ, గైడ్, డైరీ, డ్రాయింగ్, క్రాఫ్ట్, ఆర్ట్, జనరల్ నాలెడ్జ్, కంప్యూటర్ బుక్ ఇలా విద్యార్థులకు ప్రతి సబ్జెక్టుకు పది వరకు పుస్తకాలు ఇలా దాదాపు 40 పుస్తకాల కేటాయిస్తూ విద్యార్థులతో బరువులు మోయిస్తున్నారు. స్కూల్ బ్యాగ్ బరువు విద్యార్థి వయస్సు, ఎత్తుకు తగ్గట్టు ఉండాలని, విద్యార్థి బరువులో పది శాతం మించకూడదనేది వైద్య నిపుణుల సూచన. అధిక బరువున్న స్కూల్ బ్యాగుల పిల్లల శారీరక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావంచూపే ప్ర మాదం ఉందని, ముఖ్యంగా వెన్నుముకపై భారమవుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

బరువు తగ్గాలంటే..

- పిల్లలకు అవసరమైన పుస్తకాలు, నోట్‌బుక్‌లు మాత్రమే స్కూల్‌కు తీసుకువెళ్లేలా చూడాలి. బ్యాగుల్లో వాటిని మాత్రమే ఉంచాలి.
- స్కూల్‌కు దగ్గరగా ఇల్లు ఉన్న పిల్లలు పొద్దున తరగతుల పుస్తకాలు మాత్రమే తీసుకువెళ్లేలా చూసి, లంచ్‌బ్రేక్ సమయంలో మధ్యాహ్నం తరగతులకు పుస్తకాలు తీసుకువెళ్లాలి.
- రేపు ఏయే పాఠాలు జరుగుతున్నాయో, ఏయే టీచర్లు సెలవులో ఉన్నారో, ఏ పుస్తకాలు అవసరమో ముందే పిల్లలకు చెప్పేలా ప్రణాళిక రూపొందించమని స్కూల్ యజమాన్యాన్ని అడగాలి.
- చాలా పాఠశాలల్లో క్లాస్ వర్క్, హోం వర్క్ అని రెండు వేర్వేరు పుస్తకాలు వాడమని పిల్లలకు సూచిస్తుంటారు. దానికి బదులు ముందు వైపు క్లాస్ వర్క్, వెనుక వైపు హోం వర్క్ రాసేలా చూడమని టీచర్లకు సూచించొచ్చు.
- కొన్ని పాఠశాలల్లో డబుల్ బ్యాగ్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నారు. అంటే రోజువారీ పాఠ్య పుస్తకాలు అక్కడే పెట్టి, హోంవర్క్ పుస్తకాలు మాత్రం ఇంటికి తెచ్చుకునే వెసులుబాటు ఉంటుంది. ఇది ప్రైవేటు పాఠశాలల్లో కచ్చితంగా అమలయ్యేలా చూడాలి.

నో బ్యాగ్ డే..

వారానికి ఒకసారి, నెలలో రెండు రోజులు పిల్లలకు స్కూల్ బ్యాగ్ నుంచి మినహాయింపు ఇచ్చేలా చూడాలి. ఇవిఅమలు చేయాలనే ఆలోచనలు కొన్ని ప్రభుత్వాలు చేసినా అవి కార్యరూపం దాల్చడం లేదు. స్కూల్ బ్యాగ్‌లేని రో జు పిల్లలు ఆటలు, పాటలు, కథలు, బొమ్మలు.. వీటితో గడిపితే మానసిక వికాసం కలుగుతుం ది. బ్యాగ్ మోతతప్పి వెన్నుకువిశ్రాంతి లభిస్తుంది.

నల్సా పథకాలు ప్రజలకు చేరువకావాలి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత



సదస్సులో ప్రసంగిస్తున్న పీడీజే సునీత

రాజమహేంద్రవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నల్సా) అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరువ కావాల్సిన అవసరం ఉందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికారం సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. డీఎల్ఎస్ఏ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా నల్సా వారి 'పేదరిక నిర్మూలన, మానవ అక్రమ రవాణా', లీగల్ సర్వీసెస్‌లో కొత్త మాడ్యూల్‌లపై ఏర్పాటు చేసిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అంద జేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఉండే ఏడు న్యాయ సేవల పథకాలను ఇప్పుడు 14కు నల్సా పెంచిందన్నారు. జిల్లా స్థాయిలో డీఎల్ఎస్ఏ ద్వారా, మండల స్థాయిలో ఎంఎల్ఎస్ఏ ద్వారా అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామన్నారు. నేటి సమాజంలో చిన్నారులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చిన్నారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆలోచింపజేశాయని చెప్పారు. డీఎల్ఎస్ఏ ఏర్పాటు, కార్యకలాపాలు, న్యాయ సహాయం, వివిధ చట్టాలను సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మీ వివరించారు. అనంతరం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాలకు రుణాల నిమిత్తం రూ.5కోట్లు, మెప్మా ఆధ్వర్యంలో రూ.3.60కోట్ల చెక్కులను, దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు, బ్రెయిలీ లిపి పుస్తకాలు, స్త్రీ నిధి కింద కెమెరా కొనుగోలుకు రూ.1 లక్ష చెక్కును పీడీజే అందజేశారు. తొలుతగా మెప్మా, డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్, పోలీస్, డీఎల్ఎస్ఏ, వ్యవసాయ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని తిలకించారు. కార్యక్రమంలో ఎస్పీ నరసింహకిషోర్, పీడీ మూర్తి, కార్పొరేషన్ ఏసీ రామలింగేశ్వర్ పాల్గొన్నారు.

ఆవిష్కరణలు, పరిశోధనలతోనే దేశాభివృద్ధి



సారస్వత్‌ను సత్కరిస్తున్న జీజీయూ ఛాన్సలర్ చైతన్యరాజు

- వికసిత్ భారత్-2047 మనందరి బాధ్యత
- న్యూక్లియర్ సైన్సు చదివితే మంచి అవకాశాలు
- జీజీయూ జాతీయ సదస్సులో నీతి ఆయోగ్ సభ్యుడు సారస్వత్

రాజానగరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలు, పరిశోధనలతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని నీతి ఆయోగ్ సభ్యుడు, ప్రఖ్యాత మిస్సైల్ శాస్త్రవేత్త, పద్మభూషణ్ అవార్డు గ్రహీత వీకే సారస్వత్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం వికసిత్ భారత్ ఎట్ 2047 కోసం పరిశోధన, ఆవిష్కరణను ఉపయోగించడం అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సెమినార్‌ను శనివారం సారస్వత్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ వికసిత్ భారత్-2047 ఒక దృష్టి మాత్రమే కాదు, మనందరి బాధ్యత అన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పరిశోధన అభివృద్ధికి రూ.1.27 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించిందన్నారు. ప్రతి విద్యార్థి, పరిశోధకుడు, కళాశాల, విశ్వవిద్యాలయం, ఔత్సాహికులు దేశ నిర్మాణంలో పాత్ర వహించాలన్నారు. విద్యామంత్రిత్వ శాఖ ఇప్పటికే మూడు వేలకు పైగా ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసి జాతీయ ఆవిష్కరణ స్టార్టప్ విధానం ద్వారా విద్యార్థుల్లో ఔత్సాహికతను ప్రోత్సహిస్తోందన్నారు. మన జీడీపీలో 62 శాతం సేవల రంగం నుంచి, 14శాతం మాత్రమే తయారీ రంగం నుంచి వస్తోందని, ఇదొక ప్రధాన సమస్య అన్నారు. తమ దేశ జీడీపీలో చైనా 2.6 శాతం, దక్షిణ కొరియా 4.9 శాతం, ఇజ్రాయిల్ 6.3 శాతం పరిశోధనా రంగంపై ఖర్చు చేస్తుంటే మనం 0.64 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నామన్నారు. 1980 ముందు సాధారణంగా ఉన్న దక్షిణ కొరియా రెండు దశాబ్దాల్లో ఎలక్ట్రానిక్స్, బయోటెక్నాలజీ రంగాల్లో విశేషమైన పురోగతి సాధించిందన్నారు. ఆదేశ పరిశ్రమలు ఇన్‌హౌస్ రీసెర్చ్‌పై పరిశోధనలు చేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. మన దేశంలో మాత్రం పరిశోధనలు కేవలం ప్రభుత్వ రంగానికే పరిమితం అయ్యాయని, ఈ పరిస్థితి మారాలన్నారు. పరిశ్రమలు పరిశోధనలపై ఖర్చు చేయాలని సూచించారు. ప్రస్తుతం విద్యార్థుల దృష్టి కంప్యూటర్ సైన్సుపైనే ఉందని, ఇదే పరిస్థితి కొనసాగితే దేశంలో రైల్వేలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు వంటి వాటికి మానవ వనరుల కొరత ఏర్పడుతుందన్నారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణుశక్తి అవసరమని, అందుకే న్యూక్లియర్ సైన్సు చదివితే మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. నవీకరణను ఇక్రిమెంటల్ ఇన్నోవేషన్, బ్రేక్‌తూ ఇన్నోవేషన్ అని రెండు రకాలుగా చెప్పవచ్చన్నారు. ప్రస్తుతం దేశానికి రెండోది అవసరమైని, దీని ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చన్నారు. ఇన్నోవేషన్‌కి పెట్టుబడితో పాటు మార్కెట్ అవసరమన్నారు. సదస్సు కన్వీనర్ శిశిర్ సాహూ అన్వయాత్మక పరిశోధన ప్రాధాన్యతను, జ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థ వైపు దృష్టి సారించి, పరిశోధన పర్యావరణాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. సదస్సులో జీజీయూ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు, ప్రోఛాన్సలర్ కే.శశికిరణ్ వర్మ, ఉపకులపతి యు.చంద్రశేఖర్, ప్రోవైస్ చాన్సలర్ కె.విజయ భాస్కరరాజు, డీన్లు, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, ఇతర విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కల మాటున గంజాయి

- కడియంలో 326 కిలోల పట్టివేత



లారీలో తరలిస్తున్న గంజాయి

కడియం జూన్ 28(ఆంధ్రజ్యోతి): మొక్కలు మాటున గంజాయి కడియం మండలంలో మొక్కలు లోడుకు వచ్చిన లారీ అందులో గంజాయిని గుట్టుచప్పుడుకాకుండా పట్టుకువెళ్లే ప్రయత్నం చేయడంతో దానిని చాలా చాకచక్యంగా ఎన్‌సీబీ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే రాజస్థాన్‌కు చెందిన సత్యనారాయణ మీరా, సునీల్ అనే ఇద్దరు మొక్కలు లోడు కోసం కడియం వచ్చారు. అయితే ఈ లారీని నేరుగా విశాఖఏజెన్సీకి తీసుకువెళ్లి గంజాయిని లోడుచేసుకుని వాటిలో మొక్కలు కవరింగ్ ఇచ్చి తిరిగి కడియం చేరుకున్నారు. దీనిని నార్కొటిక్ పోలీస్ విభాగం కనిపెట్టి చాకచక్యంగా పట్టుకుంది. లారీలో 326 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులు ఇద్దరినీ అరెస్టు చేశారు. నిందితుల్లో సత్యనారాయణ మీరా అనే వ్యక్తి పాత నేరస్తుడని అతడిపై గతంలో గంజాయి కేసులు ఉన్నాయని కడియం సీఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

స్వల్పంగా పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

ధవళేశ్వరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గోదావరి నీటి మట్టం స్వల్పంగా పెరుగుతోంది. వర్షాకాలం ప్రారంభమైనా కొత్తనీటి ప్రవాహం చేరిక లేక గోదావరి ఇప్పటి వరకు ప్రశాంతంగానే ప్రవహించింది. పరివాహక ఎగువ ప్రాంతాలతో పాటు ఉపనదుల పరివాహకంలో కూడా సరైన వర్షపాతం నమోదు కాకపోవడంతో గోదావరి రంగు మారక నిశ్శబ్ద ప్రవాహంతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద ఒదిగిపోతుంది. ప్రస్తుతం కాటన్ బ్యారేజ్ నుంచి రైతు సాగునీటి అవసరాల కోసం డెల్టా కాలువల ద్వారా 10.500క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. గోదావరి నీటి మట్టం మరింత పెరిగితే పట్టిసీమ ద్వారా నీటిని కృష్ణా డెల్టాకు ఎత్తిపోయడానికి సిద్ధంగా ఉన్నారు. నీటి మట్టం తగు స్థాయిలో ఉండే విధంగా కాటన్ బ్యారేజ్ వద్ద గేట్లను మూసి వేసి చుక్కనీరు కూడా సముద్రంలోకి పోకుండా చర్యలు చేపట్టారు. ఎగువున భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 5అడుగులుగా ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 11వేల క్యూసెక్కుల నుంచి డెల్టా కాలువలకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది.

సత్యదేవుడికి ప్రాకారసేవ

అన్నవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకార సేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రదానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. పండితులు ప్రత్యేక పూజలనంతరం మంత్రోచ్చారణలు, బాబాభజంత్రీల నడుమ ముమ్మారు ప్రదక్షిణ జరిపారు.

భక్తవత్సల గోవింద..

- వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.63.14 లక్షలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం అధిక సంఖ్యలో భక్తులు బారులు దీరి దర్శించుకున్నారు. ఈ స్వామి వారికి సందర్భంగా సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారిని వివిధ రకాల ఫలాలు, పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తీరువీదుల్లో ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.63.14 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ఆలయంలో కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

కాగా స్వామి వారి ఆలయంలో ధర్మపథం కార్యక్రమంలో భాగంగా రాత్రి రాజమహేంద్రవరం శ్రీలక్ష్మీశ్రీనివాస కూచిపూడి నృ త్యాలయానికి చెందిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఓ చిన్నారి రెండు చేతులతో దీపాలు శిరస్సుపై బిందెలతో జ్యోతిని వెలిగించి చేసిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారులకు అధికారులు ప్రశంసాపత్రాలను అందించారు.

బ్లెసన్ కుటుంబానికి ఐజీ అశోక్ పరామర్శ



బ్లెసన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

ఆలమూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ బ్లెసన్‌జీవన్ కుటుంబ సభ్యులను ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ శనివారం పరామర్శించారు. ఆలమూరులోని కానిస్టేబుల్ బ్లెసన్ ఇంటికి విచ్చేసి బ్లెసన్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం బ్లెసన్ కుటుంబ సభ్యులతో ఐజీ మాట్లాడారు. ప్రభుత్వ పరంగా పూర్తి న్యాయం చేస్తామన్నారు. విధి నిర్వహణలో ప్రా ణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా తమ చిన్న కుమారుడికి పోలీసు ఉద్యోగం ఇప్పించాలని కోరడంతో మరికొన్నింటిని బ్లెసన్ కుటుంబ సభ్యులు ఐజీకి విన్నవించగా ఆమేరకు చేయడానికి ప్రయత్నిస్తానని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఐజీ వెంట కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్, టౌన్ సీఐలు సీ హెచ్ విద్యాసాగర్, ఎం.శేఖర్‌బాబు, ఏఎస్ఐ సూర్యచంద్రరావు, పలువురు సిబ్బంది, నాయకులు చల్లా ప్రభాకరావు, వెత్సా నానాజీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్యశాఖ ఆర్‌డీగా డాక్టర్ పద్మాశశిధర్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ప్రాంతీయ వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం జోన్-2 రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ పద్మాశశిధర్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఈమేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన పద్మాశశిధర్‌ను ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకుడు శ్రీకాంత్ రాజు, ఐఎన్‌టీయూసీ నాయకులు ఎంవీీ సత్యనారాయణ, వైఎస్ఎన్ మూర్తి, రామచంద్రరావు, జయచంద్ర కలిసి అభినందనలు తెలిపారు.



రవాణా వాహనాల ఫిట్‌నెస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

జూలై 1న 'చలో రాజానగరం' విజయంతం చేయాలని అఖిల పక్ష నేతల పిలుపు



రాజమహేంద్రవరంలో ఐక్యత చాటుతున్న అఖిల పక్ష నేతలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రవాణా వాహనాల ఫిట్‌నెస్ (బ్రేక్) రవాణా శాఖ అధికారుల నుంచి ప్రైవేట్ సంస్థలకు కూటమి ప్రభుత్వం అప్పజెప్పడం వల్ల రవాణా కార్మికులకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే ఆ విధానాన్ని ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధర్, మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్ నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష సమాశంలో మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్ కుమార్, మార్గాని భరత్‌రామ్, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, ఆర్‌పీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, కార్మిక సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడచినా రవాణా రంగ కార్మికులకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. రవాణా కార్మికులకు ఈ ఫిట్‌నెస్ విధానం వల్ల బాధ ఉన్నందువల్లే ఇంతమంది వచ్చారని త్వరలోనే దీనిపై సానుకూల నిర్ణయం ప్రభుత్వం నుంచి వస్తుందని ఆశిస్తున్నట్టు ఉండవల్లి అన్నారు. రవాణా కార్మికులకు అవసరమైన న్యాయ సహాయం చేయడానికి తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. ఏపీలో ప్రైవేటీకరణ విధానాన్ని ఉపసంహరించుకునే వరకు ఆందోళన చేయడానికి అందరూ సంసిద్ధం కావాలని మార్గాని పిలుపునిచ్చారు. కన్వీనర్లు వాసంశెట్టి గంగాధర్, బాక్స్ ప్రసాద్ మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ తరపున తాము ఈ ఆందోళన చేపట్టడం లేదని, అందర్ని కలిపి జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. జూలై1న నిర్వహించే చలో రాజానగరం విజయవంతం చేయాలని తీర్మానించారు. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వెలువడితే చలో రాజానగరం కార్యక్రమాన్ని ఉపసంహరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో ఏజీటీయూసీ నాయకుడు రెడ్డి రమణ, వైసీపీ నాయకులు వైకేఎల్, కేఎల్ నరసింహారెడ్డి, డీవీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఉభయరాష్ట్రాల ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.నారాయణరావు, ముచ్చకర్ల సత్యనారాయణ, పోలేపల్లి నాగేశ్వరరావు, ఆదినారాయణ, డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

కన్ను పడితే.. ఇల్లు ఖాళీనే!



కాకినాడలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

ముగ్గురు అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

- రూ.65 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు కరుడు కట్టిన నేరస్థులు. వారు కన్ను పడిన ఇల్లు ఖాళీ కావాల్సిందే. ఆ అంతర్ జిల్లా దొంగలు 5 జిల్లాల్లో యథేచ్ఛగా 19 నేరాలకు పాల్పడి సుమారు రూ.65 లక్షల విలువైన 582 గ్రాముల బంగారు ఆభరణాలు, 12.500 కిలోల వెండి వస్తువులను అపహరించుకుపోయి జల్సాలు చేస్తూ కాకినాడ జిల్లా పోలీసులకు చిక్కారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ జి.బిందుమాధవ్ వెల్లడించారు. ఇటీవల కాకినాడ జిల్లా పరిసర ప్రాంతాల్లో రాత్రి, పగటిపూట దొంగతనాలు అధికం కావడంతో ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఆదేశాల మేరకు అడ్మిన్ ఎస్పీ ఎంజెవి భాస్కర్‌రావు పర్యవేక్షణలో కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్, కాకినాడ రూరల్ సీఐ డీఎస్.చైతన్యకృష్ణ, క్రైం సీఐ వి.కృష్ణ తమ బృందాలతో కలిసి ఎక్కడికక్కడ నిఘాను పటిష్టం చేశారు. పోలీసులకు ముందుగా వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ చేసే క్రమంలో సాంకేతికత సహాయంతో తాళ్లరేవు మండలం జి.వేమవరం పంచాయితీ వీధిలో నివాసం ఉంటున్న 42 ఏళ్ల బొగడ శ్రీను అలియాస్ బట్టి శ్రీను అతడి సహచరులైన అనపర్తి మండలం కుతుకులూరుకు చెందిన 23 ఏళ్ల పాశి శేఖర్‌ను, అదే ప్రాంతానికి చెందిన ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఉంటున్న 24 ఏళ్ల పోతంశెట్టి సూర్యభాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు.

జైల్లో పరిచయం..యథేచ్ఛగా నేరాలు

ఈ విచారణలో బొగడ శ్రీను గతంలో తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో 13 నేరాలకు పాల్పడి పామర్రు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక కేసులో ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించినట్టు ఎస్పీ వెల్లడించారు. అతడిపై కడియం పోలీస్‌స్టేషన్‌లో 26-2021గా సస్పెక్ట్ షీట్ ఉన్నట్టు చెప్పారు. అలాగే శేఖర్ గతంలో తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో గతంలో నాలుగు నేరాలకు పాల్పడ్డాడు. సూర్యభాస్కర్‌రెడ్డి గతంలో తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో 5 నేరాలకు పాల్పడ్డాడు కాగా తొలుత శేఖర్ సూర్యభాస్కర్‌రెడ్డి తండ్రి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో అక్కడ ట్రాక్టర్‌ను ఇద్దరు దొంగలించారు. ఆ కేసులో శేఖర్‌తో పాటు సూర్యభాస్కర్‌రెడ్డి జైలుకు వెళ్లారు. జైల్లో వారికి బొగడ శ్రీను పరిచయమయ్యాడు. ఈ ముగ్గురు బెయిల్‌పై బయటకు వచ్చారు. అయితే అప్పటికే సూర్యభాస్కర్‌రెడ్డి, శేఖర్‌పై అనపర్తి పోలీసులు నిఘా పెట్టారు. బొగడ శ్రీనుపై కడియం పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ తెరవడంతో అక్కడ నుంచి ఆలమూరుకు మకాం మార్చాడు. అక్కడ చిన్న కిరాణా కొట్టు పెట్టుకుని ఆ ముసుగులో దొంగతనాలు చేసేవాడు. తన నిజస్వరూపం తెలిసిపోతుందని తాళ్లరేవు మండలం జివేమవరానికి మకాం మార్చి స్నేహితులతో కలిసి నేరాలకు పాల్పడేవాడు.

పలు జిల్లాలో 19 నేరాలు...

అలా వారు కాకినాడ జిల్లాలో కరప, గొల్లపాలెం, కోరింగ, సర్పవరం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 10 దొంగతనాలు... అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ, రాయవరం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 2 నేరాలు... తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పెరవలి, బిక్కవోలు, అనపర్తి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 4 నేరాలు.. పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇరగవరం, పెంటపాడు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 2 నేరాలు, ఏలూరులోని చేబ్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక నేరం మొత్తంగా 19 ఇళ్ల నేరాలకు పాల్పడినట్టు ఎస్పీ వెల్లడించారు. నిందితులను కాకినాడ 7వ స్పెషల్ ఏజెఎఫ్‌సిఎం అండ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపర్చనున్నట్టు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన రూరల్ సీఐ చైతన్య కృష్ణ, గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్‌కుమార్, కరప ఎస్ఐ టి.సునీత, హెచ్‌సీలు గొప్పు నరసింగరావు (చిన్నా), సీ.నారాయణరెడ్డి, పీసీలు చంద్రశేఖర్, శివప్రసాద్, ఫణీంద్ర, సురేష్‌కుమార్, రమణ, ఎన్ శ్రీనివాసరావులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ఎంజెవి భాస్కర్‌రావు, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు, సీఐలు అంకబాబు, వి.కృష్ణ ఉన్నారు.

తైక్వాండో పోటీల్లో లాహితితేజకు కాంస్యం

అంబాజీపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉత్తరాఖాండ్ హరిద్వారాలో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో కోనసీమ జిల్లా అంబాజీపేట శ్రీనివాస తైక్వాండో క్లబ్ క్రీడాకారిణి జి.లాహితి తేజ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించింది. ఈనెల23 నుంచి 25 వరకు పోటీలు జరిగినట్టు సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. కాంస్యం సాధించిన తేజను ఉపాధ్యాయులు, కోచ్‌లు అభినందించారు.



కాంస్య పతకం సాధించిన లాహితితేజ

బ్రెయిన్ స్ట్రోక్‌తో రాజోలు ఎంపీపీ మృతి

నివాళులర్పించిన మంత్రి, ఎమ్మెల్యేలు



కేతా శ్రీను (ఫైల్)

రాజోలు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాజోలు ఎంపీపీ కేతా శ్రీను(56) బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆకస్మికంగా మృతిచెందారు. ఈనెల 24న రాజోలు మండల ప్రజాపరిషత్ మండల సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. అదేరోజు సాయంత్రం తన స్వగృహమైన తాటిపాక చేరుకున్న తరువాత బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన సెప్టెంబరు 24, 2021లో రాజోలు ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉంటూ టీడీపీలో చురుకైన వ్యక్తిగా పనిచేస్తున్నారు. కేతా భౌతిక కాయాన్ని శనివారం అమలాపురం నుంచి స్వగ్రామమైన తాటిపాకకు అంబులెన్సు తీసుకువచ్చారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ శ్రీను మృతదేహంపై టీడీపీ కండువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కన్నీటి పర్యాంతమయ్యారు. శ్రీను ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పార్టీ పటిష్టత కోసం కృషి చేశారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని తెలిపారు. కుటుంబ సభ్యలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. రాజోలు, పి.గన్నవరం ఎమ్మెల్యేలు దేవవరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, దంతులూరి చంటిబాబు, మాజీ జడ్పీ చైర్మన్ నామన రాంబాబు, వైఎస్ ఎంపీపీలు పొలమూరి శ్యామ్ బాబు, యింటిపల్లి ఆనందరాజు, చాగంటి స్వామి, నాగిరెడ్డి గోపి, సూరిశెట్టి శ్రీనివాస్, సర్పంచ్ కోటిపల్లి రత్నమాల పరామర్శించిన వారిలో ఉన్నారు. ఎంపీపీ మృతి పట్ల అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ఓ ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. కేతా శ్రీను మృతదేహానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



ఎంపీపీ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

వ్యక్తిపై హత్యాయత్నం

కొత్తపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగుతున్న సమయంలో ఇద్దరి మధ్య జరిగిన వివాదంలో ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేయగా తీవ్రగాయాలపాలయ్యాడు. వివరాల ప్రకారం... కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లి శివారు నారాయణపురానికి చెందిన మానుపాటి రాజేష్, మోడేకుర్రుకు చెందిన పితాని సతీష్ కలిసి నారాయణపురం రాజేష్‌కు చెందిన చికెన్‌షాపులో మద్యం తాగుతుండగా వ్యక్తిగత విషయాలపై సతీష్ వ్యాఖ్యలు చేసి వాగ్వాదానికి దిగడంతో కోపానికి గురైన రాజేష్ సతీష్‌పై కత్తితో దాడి చేయగా మెడకు తీవ్ర గాయమైంది. సతీష్‌కు కొత్తపేట ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి రాజమహేంద్రవరం తరలించగా వైద్యులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. సమాచారంతో కొత్తపేట ఎస్ఐ సురేంద్ర ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

మలకపల్లిలో ఇద్దరు బాలికల అదృశ్యం

తాళ్లపూడి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు శుక్రవారం నుంచి కనిపించడంలేదని వారి తల్లితండ్రులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మలకపల్లి హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న కండెల్లి గౌరిప్రియ, మెరిపో తేజస్విని శుక్రవారం ఉదయం యథావిధిగా పాఠశాలకు వెళ్లి సాయంత్ర ఇంటికి తిరిగిరాలేరు. వారి ఆచూకీ తెలియనందున తల్లితండ్రులు శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఎస్.అన్నవరంలో చోరీ

తుని రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని శివారు ఎస్.అన్నవరంలో చోరీ జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న కొప్పిశెట్టి లోకేష్ కిరాణాషాపులో షెట్టర్ పగలగొట్టి కౌంటర్‌లో ఉన్న రూ.30వేల నగదు దోచుకున్నారు. మరోచోట స్కూటీ అపహరించారు.

బోటు పై నుంచి పడి కూలీ మృతి

కాకినాడ క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఏటిమొగ సమీపంలోని జగన్నాధపురం ఉప్పుటేరులో బోటుపై పనిచేస్తున్న శ్రీకాకుళానికి చెందిన చీడిపల్లి పరదేశి (48) ప్రస్తుతం జగన్నాధపురం సమీపంలో నివసిస్తున్నాడు. శుక్రవారం బోటుపై పని చేస్తూ ప్రమాదవశాత్తు బోటుపై నుంచి జారి పడి గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్ల గాలించినా ప్రయోజనం లేకపోయింది. పరదేశి మృతదేహం శనివారం జగన్నాధపురం సమీపంలోని ఉప్పుటేరులో తేలింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్రాడలో మహిళ అనుమానాస్పద మృతి



పీబీసీ కాలువలో మహిళ మృతదేహం

పిఠాపురం రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారు పీబీసీ కాలువలో మహిళ అనుమానాస్పద స్థితిలో మరణించింది. కాకినాడ రూరల్ మండలం ఎస్.అచ్యుతాపురం రావిశెట్టి వీధికి చెందిన యనమండ్ర లీలా సూర్యకిరణ్(38) భర్త కొంతకాలం క్రితం మరణించారు. ఆమె కుమార్తె విషయంలో ఇంట్లో గొడవ జరగడంతో 2రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చేసినట్టు బంధువులు తెలిపారు. అప్పటి నుంచి వెతుకుతుండగా శనివారం ఉదయం పీబీసీ కాలువలో పడి ఉండగా పోలీసులు గుర్తించారు. ఆమె ఆత్మహత్య చేసుకుందా లేదా మృతికి ఇతర కారణాలు ఉన్నాయా అనే విషయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పిఠాపురం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

పాము కాటుకు మహిళ మృతి



సత్యవతి మృతదేహం

పి.గన్నవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లిలో శనివారం పాము కాటుకు మహిళ మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సానబోయిన సత్యవతి(44) మధ్యాహ్నం ఏనుగుపల్లి లంకలో పశువులమేత కోస్తుండగా తాచుపాము కాటేసింది. సమీపంలో ఉన్న పలువురు ద్విచక్రవాహనంపై ఇంటికి తీసుకొచ్చి విషయం చెప్పారు. బంధువులు హుటాహుటిన అక్కడి నుంచి చికిత్స నిమిత్తం పి.గన్నవరం సీహెచ్‌సీ తరలించారు. అప్పటికే ఆలస్యం కావడంతో చికిత్స పొందుతూ సత్యవతి మృతి చెందింది. సత్యవతి భర్త దింపు కార్మికుడు కాగా వారికి కుమారుడు రమేష్, కుమార్తె కనకదుర్గ ఉన్నారు. బంధువులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు

కాపాడిన యువకులు

యానాం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): యానాం-ఎదుర్లంక వారధి పై నుంచి గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన యానాంలో జరిగింది. శనివారం మధ్యాహ్నం గోదావరిలో దూకిన వ్యక్తిని చూసిన యానానికి చెందిన యువకుడు మల్లాడి వెంకట్ తమ మిత్రులతో కలిసి అక్కడే ఉన్న సీగల్స్ బోటు సహకారంతో గోదావరిలో దూకిన వ్యక్తిని కాపాడి యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అతడి వద్ద ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా కాకినాడకు చెందిన తలాటం శ్రీనివాసరావుగా గుర్తించి బంధువులకు సమాచారం ఇవ్వండంతో వారు యానాం వచ్చి శ్రీనివాసరావును కాకినాడ అసుపత్రికి తీసుకెళ్లారు. శ్రీనివాసరావును కాపాడిన వెంకట్, స్నేహితులను పలువురు అభినందించారు.

గర్భిణి, శిశువు మరణంపై అధికారుల విచారణ



వేలచింతలగూడెంలో వారా లక్ష్మి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

గోపాలపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో పురుడు పోసుకుంటూ ప్రమాదవశాత్తూ తల్లి, శిశువు మృతిచెందిన విషయం విదితమే. దీనిపై జిల్లా కలెక్టర్ పీ.ప్రశాంతి ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో సంధ్య, డీఐవో కోమల శనివారం విచారణ చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం వేలచింతలగూడెం గ్రామానికి చెందిన వారా లక్ష్మి 2వ కాన్పు పురుడు పోసుకునేందుకు ఈనెల 24న మంగళవారం ఉదయం గోపాలపురం సామాజిక ఆరోగ్యకేంద్రంలో చేరింది. అయితే ప్రసూతి విభాగ మత్తు వైద్యులు 25వ తేదీ ఆసుపత్రిలో పురుడు పోసేందుకు సిద్ధం చేశారు. మత్తు మందుఇచ్చిన కొద్ది సేపటికే స్పృహ కోల్పోతున్నట్టు గమనించిన వైద్య సిబ్బంది వెను వెంటనే లక్ష్మికి కృత్రిమ ఆక్సిజన్ అందించి 108 వాహనంలో రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు లక్ష్మిని పరిక్షించి ప్రసవం కోసం ఆపరేషన్ చేసే సమయంలో లోపల ఉన్న కడుపులోని శిశువుతో పాటు లక్ష్మి చనిపోయినట్టు నిర్ధారించారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్టు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు. కుటుంబసభ్యులు తెలిపిన సమాచారాన్ని కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. అన్నదేవరపేట పీహెచ్‌సీ వైద్యురాలు స్వర్ణలత,ఆశా కార్యకర్తలు ఉన్నారు.

పిఠాపురంలో గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం

పిఠాపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో రెండు చోట్ల గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలు కలకలం రేపాయి. సినిమాసెంటర్‌లోని డివైడర్ వద్ద ఒక వ్యక్తి మరణించగా, బైపాస్‌రోడ్డులోని బస్‌షెల్టర్ సమీపంలో సర్కిల్‌కార్యాలయానికి చేరువలో మరో వ్యక్తి మరణించి ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారి గురించి ఏ వివరాలు తెలియరాలేదు. బిచ్చగాళ్లగా భావిస్తున్నారు. మృతదేహాలను తరలించేందుకు పోలీసులు, మున్సిపల్ సిబ్బంది చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చోరీ కేసులో నలుగురి అరెస్టు



రాజోలు పోలీసుస్టేషన్‌లో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేష్‌కుమార్

రాజోలు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాజోలు మండలం కూనవరంలో జరిగిన ఓ చోరీ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశామని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ శనివారం తెలిపారు. రాజోలు సర్కిల్ పోలీసుస్టేషన్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. కూనవరానికి చెందిన ఆర్.రామకృష్ణారావుకు చెందిన శ్రీవెంకటేశ్వరా రా అండ్ బాయిల్డ్ రైసుమిల్లుకు 2018 డిసెంబరులో ఆరుగురు వ్యక్తులు వచ్చారు. ఇన్‌కం ట్యాక్సు అధికారులమని చెప్పి రూ.19లక్షల నగదు, విలువైన భూమి పత్రాలు, ప్రాంసరీ నోట్లు, ఆధార్‌కార్డులు, బ్యాంకు చెక్‌బుక్కులు, బ్యాంకు పుస్తకాలను దౌర్జన్యంగా తీసుకుని కారులో పరారయ్యారు. రామకృష్ణారావు ఫిర్యాదు మేరకు రాజోలు పోలీసుస్టేషన్‌లో అప్పటి ఎస్ఐ ఎం.నాగరాజు కేసు నమోదు చేశారు. నిందితులు అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్నారు. 2020లో ఇదే తరహాలో తెలంగాణలోని గచ్చిబౌలీ పోలీసుస్టేషన్‌లో అరెస్టు అయి బెయిల్ విడుదలై పోలీసులకు కనపడకుండా తిరుగుతున్న మలికిపురం మండలం కేశనపల్లికి చెందిన వై.అరవింద్, గూడపల్లి పల్లిపాలేనికి చెందిన ఎస్.సందీప్, గూడపల్లికి చెందిన ఎం.మణికంఠ, పి.గన్నవరం మండలం పోతవరానికి చెందిన ఎన్.మురళీశ్రీధర్ శుక్రవారం సాయంత్రం శివకోటిలో నూతన హైవేపై ఉండగా రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి చాకచక్యంగా పట్టుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు తెలిపారు. నలుగురు నిందితులను రాజోలు సీఐ సమక్షంలో కోర్టులో హాజరు పరిచారు. కేసును చాకచక్యంగా చేధించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

కేబుల్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

రూ.20 లక్షల మేర నష్టం



ఆహుతైన కేబుల్ వైర్లు

అంబాజీపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు మార్కెట్‌కు వెళ్లే దారిలో ఉన్న కొత్తపల్లి కృష్ణమూర్తి డాబాలోని కేబుల్ కార్యాలయంలో శుక్రవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్ కారాణంగా జరిగిన ఈ ప్రమాదంలో సిటికేబుల్‌కు సంబంధించి సెట్ ఆప్ బాక్సులు, యంత్ర పరికరాలు, వైర్లు, విలువైన ఆపరేటింగ్ సిస్టమ్ అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.20లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని, ఈ కేబుల్ కార్యాలయం వద్ద సుమారు 3 గ్రామాలకు టీఎస్ఎన్ ద్వారా కేబుల్ నెట్‌వర్క్‌ను అందించడం జరుగుతుందని నిర్వహకుడు పళ్ళ సురేష్ తెలిపారు. పై అంతస్థులో ఉన్న వారికి ఏ ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. సర్పంచ్ జల్లి బాలరాజు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి ఘటన స్థలాన్ని పరిశీలించారు.

అంతర్వేది తీరాన అగ్గిబాట పురుగులు

పర్యాటకులను కుట్టడంతో మంటలు, దురదలు



సముద్రం ఒడ్డున కనిపించిన అగ్గిబాట పురుగు

అంతర్వేది, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర తీరంలో అగ్గిబాట పురుగులు ప్రత్యక్షమయ్యాయి. బీచ్‌లో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు, పర్యాటకులు, జాలర్లు, మత్స్యకారులను ఈ పురుగులు తరచూ కనిపిస్తున్నాయి. ఎవరికైనా ఇవి తగిలినా, కుట్టినా ఆ భాగంలో వేడి మంటలు, దురదలు వస్తున్నాయని స్నానమాచరించేవారు వాపోతున్నారు. క్రిమికీటకాలు, అగ్గిబాట అనే విష పురుగులు కుట్టినప్పుడు దురదలు వస్తున్నాయని పర్యాటకులు వాపోతున్నారు. అంతర్వేది సాగర సంగమం వద్ద జెల్లీ ఫిష్‌లు (అగ్గిబాట) అనే విషపురుగులు రెండు రోజులుగా అధికంగా కనిపిస్తున్నాయి. వాతావరణంలో మార్పులు సంభవించినా, సముద్రంలో అలజడులు ఏర్పడ్డ ఈ విషపురుగులు ఒడ్డుకు వస్తుంటాయి. వాటిని ఎవరైనా పట్టుకున్నా, అవి మనుషులను కుట్టినా విపరీతమైన మంటలతో కూడిన దద్దుర్లు వస్తుంటాయి. ప్రమాదకర జీవి కానప్పటికీ అవి కుట్టిన చోట కొబ్బరినూనె రాసినా, ఉప్పునీటితో కడిగినా ఉపశమనం కలుగుతుంది. మరీ ఎక్కువగా దద్దుర్లు వస్తే వైద్యులను సంప్రదించాలి. సీ డ్రాగన్ ఫిష్ అని కూడా మత్స్యకారులు పిలుస్తున్నారు. శనివారం పదిమందిని పైగా కుట్టడంతో పాలకొల్లు, భీమవరం ఆసుపత్రులకు వెళ్లినట్టు స్థానికులు తెలిపారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా రమేష్

అమలాపురం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆకుమర్తి రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ కేబీ స్మార్ట్ మధు, ఇన్‌చార్జి డాన్‌సూరి మాదిగ, జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి సారథ్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు.

వైసీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా రమేష్

పి.గన్నవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా ఉడిమూడి గ్రామానికి చెందిన సాధనాల రమేష్‌ను నియమించారు. నియోజకవర్గ కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా కొక్కిరి రవికుమార్, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా దొమ్మేటి వెంకటదుర్గారావులను పార్టీ నియమించింది.

అప్పనపల్లి బాలబాలాజీకి ప్రత్యేక పూజలు





మామిడికుదురు: బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు, అంతర్వేది: లక్ష్మీనరసింహస్వామి, భక్తుల సందడి

మామిడికుదురు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. తెల్లవారుజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. భక్తులతో కొత్త, పాత ఆలయాలు కిటకిటలాడాయి. శనివారం వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,56,989 ఆదాయం వచ్చిందని, స్వామివారిని 4వేల మంది దర్శించుకుని 2500మంది దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానంలో అన్నప్రసాదం స్వీకరించారని ఏసీ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

అంతర్వేది ఆలయంలో పూజలు

అంతర్వేది, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి, సీఆర్డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నెల్లి శ్రీవెంకట భోగవసంతరాయుడు శనివారం విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం వేదపండితులు మహాదాశీర్వచనం అందించారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు..

నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, వివిధ సేవల ద్వారా రూ.1,04,589, అన్నదాన ట్రస్టు విరాళాల ద్వారా రూ.1,13,047 మొత్తం రూ.2,17,636 ఆదాయం వచ్చిందని ఏసీ ప్రసాద్ తెలిపారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి



ఆశా వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

అమలాపురం టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు సంబంధిత శాఖ మంత్రి, అధికారులను కలిసినా ఇంత వరకు పరిష్కరించకపోవడం శోచనీయమన్నారు. ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. జూలై 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. అమలాపురం ఎంప్లాయీస్ హోంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.ఎస్తేరురాణి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ధనలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర కమిషనర్ ఇటీవల విడుదల చేసిన సర్క్యులర్‌లో ఆశ వర్కర్లు ఏ పని చేయాలో స్పష్టంగా ఉందన్నారు. ఆశ వర్కర్లు ఎవరూ అదనపు పనులు చేయరాదని, అలా చేయడం వల్ల అనారోగ్యానికి గురవుతారన్నారు. వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచడంతో పాటు రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్‌పై ప్రభుత్వం జీవోలు విడుదల చేయాలన్నారు. అప్పటి వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆశ వర్కర్లపై పని ఒత్తిడి తగ్గించి కనీస వేతనం రూ.26వేలు చెల్లిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలక సుభాషిణి, జిల్లా కమిటీ సభ్యులు గుర్రాల బేబి, మంగాదేవి, వెంకటలక్ష్మి, బొంతు సుజాత, ఉల్లింగి శ్రీలక్ష్మి, ఈశ్వరి, కనకదుర్గ, భూలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి లెర్నింగ్ లైసెన్సు పొందాలి



రహదారి భద్రతపై విద్యార్థుల అవగాహన తెలుసుకుంటున్న రవాణాధికారి శ్రీనివాసరావు

అమలాపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): 18ఏళ్లు నిండిన ప్రతీ విద్యార్థి లెర్నింగ్ లైసెన్సు పొందాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు సూచించారు. ఇటీవల వేసవి సెలవుల్లో జిల్లాలో 716మంది విద్యార్థులు లెర్నింగ్ లైసెన్సులు పొందడం శుభ పరిణామమన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. లెర్నింగ్ లైసెన్సు కోసం ప్రభుత్వ వెబ్‌సైట్‌లో శ్లాట్ బుక్ చేసుకుని ఆర్టీఏ కార్యాలయంలో నిర్వహించే టెస్టుకు హాజరుకావాలన్నారు. అమలాపురం, రావులపాలెం, మండపేట రామచంద్రపురం కార్యాలయాల్లో ఆధార్ అడ్రస్ ప్రకారం శ్లాట్ బుక్ చేసుకునే సదుపాయం ఉన్నందున విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలల యాజమాన్యంతో పాటు తల్లిదండ్రులు లెర్నింగ్ లైసెన్సుల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థి దశ నుంచే రహదారి భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ సదస్సులు నిర్వహిస్తున్నామని శ్రీనివాసరావు వివరించారు.

5న నేషనల్ లోక్ అదాలత్

అమలాపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వచ్చే నెల 5వ తేదీన మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నేషనల్ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, రెండో అదనపు జిల్లా జడ్జి పి.గోవర్ధన్ తెలిపారు. ఈలోక్‌అదాలత్‌లో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంకు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరిస్తారు. బ్యాంకులు, రెవెన్యూ, పోలీసు అధికారులు ఈకార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

డీఈవో తనిఖీ



అంతర్వేదిపాలెం హైస్కూలును పరిశీలిస్తున్న డీఈవో సలీంబాషా

అంతర్వేది, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిపాలెం గ్రామంలో ఉన్న హైస్కూలును జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణను పరిశీలించి అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. అలాగే విద్యార్థులతో మాట్లాడి తరగతుల వివరాలు, భోజనవసతి, తాగునీరు, పారిశుధ్యం తదితర విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ కేతా శ్రీను మృతి తీరని లోటు



శ్రీను మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు

మామిడికుదురు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాజోలు ఎంపీపీ కేతా శ్రీను మృతి తీరని లోటని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. నాలుగు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఎంపీపీ శనివారం మృతి చెందడంతో ఆయన భౌతికకాయం వద్ద ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపడతారని అనుకుంటే హఠాత్తుగా అనారోగ్యంతో మరణించడం బాధాకరమన్నారు. ఎంపీపీ కుటుంబానికి ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయనతో పాటు ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, జనసేన మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, సర్పంచ్ అడబాల తాతకాపు, టీడీపీ నాయకులు మొల్లేటి శ్రీను, చుట్టుగుళ్ల కిశోర్ తదితరులు ఉన్నారు.

ఫ్యాన్లు అందించిన పూర్వ విద్యార్థులు

అమలాపురం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బండారులంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారం హెచ్ఎం ఎస్.వెంకటలక్ష్మీబాల, ఉపాధ్యాయుల సమక్షంలో సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జాన జగదీష్ చంద్రగణేష్, విత్తనాల సురేష్, బళ్ల నాగమణి, పుత్సల భాస్కర్, సరెళ్ల ఏడుకొండలు, దంగేటి ప్రసాద్, మామిడిశెట్టి విష్ణుప్రసాద్, కాలెపు కుమారస్వామి, బళ్ల వేణు, లక్కింశెట్టి మల్లికార్జున, పిచ్చిక సత్యం పాల్గొన్నారు.

మాలలపై దాడిని ఖండించిన ఐక్యవేదిక

అమలాపురం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అత్తిలి మండలం ఆరపల్లి గ్రామంలో ఇటీవల మాల సామాజిక వర్గంపై మాదిగలు విచక్షణా రహితంగా దాడులు చేయగా కూటమి ప్రభుత్వం మద్దతు పలకడాన్ని దళిత ఐక్యవేదిక జిల్లాశాఖ తీవ్రంగా ఖండించింది. అరిగెలపాలెంలో శనివారం ఐక్యవేదిక అత్యవసర సమావేశం జంగా బాబూరావు అధ్యక్షతన జరిగింది. చైర్మన్ డీబీ లోక్, కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, గెడ్డం సురేష్‌బాబు, కాశి వెంకట్రావు, రేవు తిరుపతిరావు, పొలమూరి మోహన్‌బాబు మాట్లాడారు. షెడ్యూల్డు కులాల మధ్య చిచ్చుపెట్టి కూటమి ప్రభుత్వం పబ్బం గడుపుకుంటుందన్నారు.

పాత అక్విడెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా



పాత అక్విడెక్టుపై చెత్త తొలగింపు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం పాత అక్విడెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ఇన్‌చార్జ్ డీఈఈ ఆర్.నాగార్జునరావు ఆధ్వర్యంలో పాత అక్విడెక్టుపై, కాల్వతొట్టెలో చేపట్టిన చెత్త తొలగింపు పనులను ఎమ్మెల్యే పరిశీలించి అనంతరం మాట్లాడారు. చారిత్రాత్మక కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అక్విడెక్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం అక్విడెక్టు పరిసరాల ను పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. కొత్త అక్విడెక్టుపై ఇరు వైపులా పేరుకుపోయిన మట్టిని తొలగించాలని ఆదేశించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ చొల్లంగి సత్తిబాబు, వాసంశెట్టి కుమార్, షేక్ దొరబాబు, ఇరిగేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీఈవో పాఠశాలల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

మలికిపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా మలికిపురం మండలంలో పలు హైస్కూళ్లు, ప్రాథమిక పాఠశాలలను శనివారం తనిఖీ చేశారు. గూడపల్లి చొప్పిడివారి మెరకలో నూతనంగా ఏర్పాటు చేసిన హైస్కూలును సందర్శించి విద్యార్థులతో మమేకమయ్యారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి తనిఖీలో భాగంగా వండిన అన్నాన్ని పరిశీలించారు. హైస్కూలుకు కావాల్సిన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ తరగతికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలకు కావాల్సిన సౌకర్యాల గురించి సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ డీఈవో దృష్టికి తెచ్చారు. అదే విధంగా ఇరుసుమండ మోడల్ పాఠశాలలోని సమస్యలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో చర్చించారు. లక్కవరం మోడల్ పాఠశాలకు ఇరుసుమండలోని 3,4,5 తరగతుల విద్యార్థులను తమ గ్రామం నుంచి లక్కవరానికి పంపేది లేదని తల్లిదండ్రులు డీఈవో దృష్టికి తెచ్చారు. ఈసమస్యపై తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో మాట్లాడారు. శంకరగుప్తం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఈవో ఎం.విజయశ్రీతో పాటు ఆయా పాఠశాలల హెచ్ఎంలు బి.మెహర్, జీవీవీ ప్రసాద్ ఉన్నారు.

నేడు బాలభాను అష్టావధానం



డాక్టర్ ఆకెళ్ల బాలభాను

అమలాపురం టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీకళావేదిక జిల్లాశాఖ కోనసీమ రచయిత సంఘం ఆధ్వర్యంలో ప్రథమ మహిళా శతావధాని డాక్టర్ ఆకెళ్ల బాలభాను అష్టావధానం కార్యక్రమం ఆదివారం సాయంత్రం భూపయ్య అగ్రహారంలోని మున్సిపల్ పిల్లల పార్కు సమీపంలోని కోనసీమ మహిళా మండలి భవనంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి తెలిపారు. పండితులు, కవులు, కళాకారులు, సాహితీ అభిమానులు పాల్గొని అష్టావధానం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

అమలాపురం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఇందుపల్లి శివారు భట్లపాలెంలో శనివారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. నలుగురు మహిళలతో పాటు తొమ్మిది మందిపై దాడిచేసి గాయపరిచింది. మూడు గేదెలపై దాడికి పాల్పడింది. గాయపడ్డ నలుగురు మహిళలు అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలే



వర్షం నీటితో అధ్వానంగా తయారైన రోడ్డు

మామిడికుదురు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులోని షిర్డిసాయిబాబా ఆలయం నుంచి గన్నేరుపుంతకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. కిలోమీటరన్నర మేర రోడ్డంతా గోతులు పడి వర్షం వస్తే ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈరోడ్డుపై నుంచి లూటుకుర్రు, ఎన్‌సీఆర్ కాలనీ గన్నేరుపుంత ప్రాంతాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తారని, రోడ్డు మొత్తం మురికినీరు చేరడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. లూటుకుర్రు, మామిడికుదురు గ్రామాల సరిహద్దులో ఈరోడ్డు ఉండడం వల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకుండా వదిలేశారని ఆయా ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షం వస్తే ఈ రోడ్డుపై నుంచి వివిధ స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు ప్రమాదాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అధ్వానంగా తయారైన రోడ్డును ఆధునికీకరించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సుబ్బాలమ్మకు ఆషాఢం సారె



సుబ్బాలమ్మకు ఆషాఢం సారె తీసుకువెళుతున్న మహిళా భక్తులు

అమలాపురం టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం అమలాపురం గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మ అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించారు. అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద నుంచి సమరస సేవా ఫౌండేషన్ నగర కన్వీనర్ ఆర్లపల్లి ముత్యం ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలు సారె బిందెలతో బయలుదేరారు. బాజాభజంత్రీలు, మంగళ వాయిద్యాలతో శ్రీచెన్నమల్లేశ్వరస్వామి, శ్రీకేశవస్వామి ఆలయాల వద్ద నుంచి వేపచెట్టు కనకదుర్గమ్మ వీధి నుంచి వంటెద్దువీధిలోని గనికమ్మ ఆలయం, నల్లావీధి శ్రీవియజదుర్గమ్మ ఆలయం, గండువీధి శేషశయన మందిరం, మెయిన్ రోడ్డు చేరుకుంది. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద నుంచి తిరిగి సారె బిందెలతో శోభాయాత్రగా శ్రీసుబ్బాలమ్మ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో గురుభవానీ ముత్యాలరావు, సహకన్వీనర్ కోన వెంకట్రావు, ఖండ సంయోజక్ మేడిశెట్టి శ్రీరామ్, ధర్మ ప్రచారక్ మేడిశెట్టి నాగభూషణం, యెండూరి సీత తదితర నగర పెద్దలతో కలిసి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన

ముమ్మిడివరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజలు డయేరియా, మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముమ్మిడివరం అర్బన్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నగర పంచాయతీ పరిధిలోని రాయుడువారిపాలెంలో శనివారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో అర్బన్ పీహెచ్‌సీ పోలమ్మ చెరువు సూపర్‌వైజర్ బి.సంపూర్ణ పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. మురుగునీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాదాల నాగసత్య మంగాకుమారి, హెల్త్ అసిస్టెంట్ ఎం.మీరాసాహెబ్, ఏఎన్ఎం పి.దుర్గాదేవి, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష

యానాం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలోని పలు ప్రైవేట్ కళాశాలల్లో ప్రభుత్వ కోటాలో భాగంగా సెంటాక్ ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఆదివారం పరీక్ష నిర్వహించనున్నారు. యానాం రీజియన్‌కు సంబంధించి పీఎం రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉదయం 10నుంచి 12గంటల వరకు పరీక్ష జరగనుంది. యానాంలో 54మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈపరీక్షకు జోనల్ సూపర్‌వైజర్‌గా నియమితులైన పుదుచ్చేరి విద్యుత్‌శాఖ ఓఎస్‌డీ పి.సావిత్రి యానాం వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు.

భాగిర్తమ్మ జాతర మహోత్సవాలు

ముమ్మిడివరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): యాదవుల కుల దైవమైన శ్రీభాగిర్తమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. మూడు రోజులు నిర్వహించే ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని గుడి నుంచి బయటకు తీసుకువచ్చి ఉత్సవాలు ప్రారంభించారు. డప్పుల వాయిద్యాలు, కొంబూరలు, బాణసంచా కాల్పులు నడుమ అమ్మవారి జాతర నిర్వహించారు. శనివారం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మట్ట రాంబాబు, కోరశిక సత్తిబాబు, మట్ట సత్తిబాబు, జి.మల్లిబాబు, మాగాపు సత్తిబాబు, మట్ట సత్యనారాయణప్రసాద్, వంటపాటి వెంకన్న, మాగాపు దుర్గానారాయణ, మట్ట గోవిందరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుచ్చిబాబు పరామర్శ

ముమ్మిడివరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ టీటీఆర్‌నగర్‌కు చెందిన జనసేన పార్టీ నాయకుడు జగతా వెంకటశివకేశవరావు ఇటీవల మృతిచెందారు. కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. వెంకటశివకేశవరావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. శివకేశవరావు సోదరులు గోపాలకృష్ణ, రామచంద్రరావులను పరామర్శించారు. తాడి నరసింహారావు, గొలకోటి దొరబాబు, గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, యాళ్ల ఉదయ్, పాయసం చిన్నీ, సాగి సూరిబాబురాజు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్‌ను బహూకరించిన పూర్వ విద్యార్థులు

అయినవిల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఫర్నిచర్‌ను పాఠశాలకు బహూకరించారు. రూ.30వేల విలువైన వాటర్ ప్రూఫ్ షామియానా, 40ప్లాస్టిక్ కుర్చీలను బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యల్లమెల్లి రఘువంశీ, పిట్ల కృష్ణ, గుబ్బల నాగేంద్ర, విత్తనాల శ్యాంకుమార్, ఉపాధ్యాయులు నేరేడుమిల్లి సత్యనారాయణ, వై.ఫణికుమార్, జి.సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

పి.గన్నవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతి, యువకులు ఉపాధి అవకాశాల కోసం ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో విధిగా విద్యా వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి వసంతలక్ష్మి కోరారు. పి.గన్నవరం గ్రేస్ డిగ్రీ కళాశాలలో వికాస అధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జాబ్‌మేళాలో పది ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 163మంది అభ్యర్థులు హాజరుకాగా 76మంది ఉద్యోగాలు పొందినట్టు వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో డి.హరిశేషు, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా ఉపాధి అధికారి కె.రాజేంద్రప్రసాద్, గ్రేస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎస్.చరణ్, ప్రిన్సిపాల్ పీవీఆర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

రైతులకు దాణా పంపిణీ

అంతర్వేది, జూన్ 28(ఆంధ్రజ్యోతి): శృంగవరప్పాడు, మోరి, మోరిపోడు పాడి రైతులకు దాణా బస్తాలను శనివారం ఏడీ వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు ముప్పర్తి నాని పంపిణీ చేశారు. పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకుని సకాలంలో పాడి పశువులకు సరైన దాణా అందించాలని రైతులకు సూచించారు.

సిద్ధివినాయకుడిని దర్శించుకున్న జేసీ, డీఎస్పీ



సిద్ధివినాయకస్వామి సన్నిధిలో కుమార్తెలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న జేసీ దంపతులు

అయినవిల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి దంపతులు శనివారం కుటుంబ సమేతంగా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. తొలుత వీరికి ఆలయ ప్రధానార్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం జేసీ దంపతులు స్వామివారి సన్నిధిలో తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. అలాగే కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని లఘున్యాస అభిషేకంలో పాల్గొన్నారు. వీరికి ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలి

అంబాజీపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న సంపద కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని జిల్లా పంచాయతీ అధికారిణి శాంతాలక్ష్మి అన్నారు. మాచవరం పంచాయతీ ఏరియాలో ఆమె తడిచెత్త, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలం సందర్భంగా గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. మురుగునీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మాచవరంలో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని డీపీవో పరిశీలించారు. చెత్త నుంచి వర్మికంపోస్టు ఏవిధంగా తయారు చేస్తున్నారో పరిశీలించారు. ఎంపీడీవో భీమారావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారిసుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి కె.సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

విద్యపై శ్రద్ధ పెట్టాలి

అంబాజీపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధన కోసం విద్యపై ప్రతి విద్యార్థి శ్రద్ధ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి వసంతలక్ష్మి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కెరియర్ గైడెన్స్‌పై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రతి సబ్జెక్టుపై మక్కువ పెంచుకుని చదవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సాయిరామ్, పీడీ ఆదిలక్ష్మి, బీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాచుపాము హల్‌చల్

కాట్రేనికోన, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు పాములు ఇళ్లల్లోకి, దుకాణాల్లోకి చేరుతున్నాయి. చెయ్యేరు పంచాయతీ శివారు నేతాజీనగర్‌కు చెందిన సామంతకుర్తి దానయ్య ఇంటి ఆవరణలో ఏడు అడుగుల తాచుపాము ప్రవేశించి స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. పాములు ఆవాసాలను వీడి జనావాసాల్లో చొరబడుతున్నాయి. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందడంతో అక్కడకు చేరుకుని పామును బంధించి నిర్జన ప్రదేశంలో విడిచిపెట్టారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

మామిడికుదురు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలంటూ కోరుతూ విద్యాశాఖ సిబ్బంది శనివారం మామిడికుదురులో ర్యాలీ నిర్వహించారు. మన పాఠశాల మనందరి బాధ్యత అంటూ మామిడికుదురు ఎమ్మార్సీ కార్యాలయం నుంచి ర్యాలీని ప్రారంభించారు. సమగ్ర శిక్ష జిల్లా ఏపీసీ మమ్మీ, సీఎంవో సుబ్రహ్మణ్యం పాల్గొని ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మామిడికుదురు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీవో జి.భవానీ సూచించారు. పాశర్లపూడి శ్రీసత్రంలో నిర్వహిస్తున్న మహిళలకు ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీవో శనివారం సందర్శించారు. ఈశిక్షణను వినియోగించుకుని ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని కోరారు. కార్యక్రమంలో ఏవో కె.వెంకటేశ్వరరావు, కుట్టు శిక్షకురాలు మహేజాబిన్ తదితరులు పాల్గొన్నారు.

బీజ రక్ష.. రైతుకే రక్ష

మలికిపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రైతు సరైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా మేలైన దిగుబడులు, అధిక లాభం పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి కిరణ్ అన్నారు. దిండిలో వరి నారుమడులు వేసే రైతులకు సామూహికంగా బీజామృతంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో విత్తన శుద్ధి చేయడం తెలిపారు. ఈసందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో విత్తనశుద్ధి, నారు శుద్ధి చేయడం వల్ల విత్తనం నుంచి సంక్రమించే తెగుళ్లను అరికట్టేందుకు, మొలక శాతాన్ని పెంచేందుకు ఉపయోగపడుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా చీడపీలు ఆశించవని, ఎక్కువ దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారిణి రమ్యప్రియాంక, మౌనిక, హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ మండలి ప్రొటెక్షన్ కౌన్సిల్ ఏర్పాటు

అంబాజీపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఏర్పడిన అనంతరం వినియోగదారుల రక్షణ మండలి ప్రొటెక్షన్ కౌన్సిల్ ఏర్పాటు చేసినట్టు కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి తెలిపారు. కలెక్టర్ ఉత్తర్వులు మేరకు ప్రభుత్వ పరంగా రక్షణ మండలి కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి ఈ కమిటీ సమావేశం నిర్వహించి వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈకమిటీలో సభ్యులుగా కోకోఫెడ్ చైర్మన్ బలరామమూర్తి, కార్యదర్శి ఆదిత్యకిరణ్, సభ్యులు బీవీవీ సత్యనారాయణ, మాలే శ్రీనివాసనగేష్, అద్దంకి అమరేశ్వరరావు, అధికారులు ఉంటారన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో తొలి సమావేశం జరుగుతుందన్నారు. ఈసమావేశానికి డీసీపీసీ సభ్యులందరూ విధిగా హాజరుకావాలని బలరామమూర్తి కోరారు.

యువకుడి అదృశ్యంపై కేసు

అంబాజీపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): యువకుడి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపేట మండలం గొల్లపానికి చెందిన 19ఏళ్ల యువకుడు దూనబోయిన యుగంధర్ నెల రోజుల నుంచి మాచవరంలోని బంధువుల ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈనెల23న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

హామీలు నెరవేర్చకపోవడం వల్లే

వైసీపీకి 11 సీట్లు

మంత్రి సుభాష్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం వల్లే వైసీపీ 11 సీట్లకు పరిమితం అయ్యిందని మంత్రి సుభాష్ అన్నారు. శనివారం రామచంద్రపురంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ఏడాది పాలనలో 90 శాతం హామీలు అమలుచేశామన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ నియామకాలు, పింఛన్ల పెంపు, మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలెండర్లు, తల్లికి వందనం అమలు చేశామన్నారు. మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామన్నారు. 175 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి నిరుద్యోగులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. 2027 నాటికి పోలవరం నిర్మించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. ప్రపంచంలో మేటిగా అమరావతి నిర్మాణం చేసి ప్రజలకు అంకితమిస్తామన్నారు. పరిశ్రమలను తీసుకువచ్చి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వైసీపీ మాటలను ప్రజల నమ్మేస్థితిలో లేరన్నారు. ఇకనైనా ప్రజలను పక్కదారి పట్టించే రాజకీయాలు మానుకోవాలని మంత్రి కోరారు.

భక్తులకు మెరుగైన సేవలందించడమే ఆర్టీసీ లక్ష్యం

రవాణాశాఖ జిల్లా అధికారి రాఘవకుమార్

ఆత్రేయపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ఆర్టీసీ లక్ష్యమని రవాణాశాఖ జిల్లా అధికారి రాఘవకుమార్ పేర్కొన్నారు. శనివారం ఆత్రేయపురం మండలం వాడపల్లి బస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఆర్టీసీలో ప్రయాణించే భక్తులకు సంస్థ అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మూడు డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ప్రతి శనివారం వాడపల్లికి నడుపుతున్నట్లు తెలిపారు. అనంతరం ఆత్రేయపురం బస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఆయన వెంట స్టేషన్ మేనేజర్ మైగాపుల గురవయ్యానాయుడు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): వాడపల్లికి వెళ్లే భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతామని జిల్లా రవాణాధికారి రాఘవకుమార్ అన్నారు. రావులపాలెం బస్టాండ్‌ను శనివారం ఆయన సందర్శించారు. బస్సుల్లో ప్రయాణిస్తున్న వారి వద్దకు వెళ్లి పలు విషయాలపై ఆయన ఆరా తీశారు.


వాడపల్లి బస్సులో ప్రయాణికులతో మాట్లాడుతున్న రవాణాశాఖ జిల్లా అధికారి

'పూతరేకుల ఖ్యాతిని సంరక్షించాలి'

ఆత్రేయపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం పూతరేకుల ఖ్యాతిని సంరక్షించాలంటూ కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు పికానా ఫుడ్స్ డైరెక్టర్ గాదిరాజు ప్రసాదరాజు కోరారు. ఇటీవల కేంద్ర మంత్రి జిల్లా పర్యటన సందర్భంగా పూతరేకుల ఖ్యాతిని ఆయనకు తెలిపారు. కల్తీనెయ్యి వాడకం వల్ల పూతరేకుల ఖ్యాతికి కొంత మంది నష్టం కలిగిస్తున్నారని కల్తీనెయ్యి అక్రమార్కులపై కఠిన చట్టాలు రూపొందించి అమలు చేయాలన్నారు. మహిళల కుటీర పరిశ్రమగా దీన్ని ఏర్పరుచుకుని ఆర్థికంగా ఎదుగుతున్నారన్నారు. కల్తీనెయ్యిని నిరోధించి ఖ్యాతిని కాపాడాలంటూ మంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

రాయవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని రామచంద్రపురం డీవైఈవో ప్రత్తి రామలక్ష్మణ మూర్తి తల్లిదండ్రులను కోరారు. శనివారం చెల్లూరు అంజనేయనగర్‌లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీవైఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తున్నదన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు బడిమానేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్పించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు.


చెల్లూరులో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న డీవైఈవో రామలక్ష్మణమూర్తి

బడిఈడు పిల్లలు నూరుశాతం పాఠశాలల్లో ఉండాలని, 6-14 సంవత్సరాలలోపు పిల్లలు బడుల్లో చేర్చడమే లక్ష్యమన్నారు.

వచ్చేనెల 2 నుంచి ప్రభుత్వ పాలనపై ప్రజలకు చెబుదాం

ఎన్నికల పరిశీలకుడు గన్ని కృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న గన్నికృష్ణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలన, అభివృద్ధి, సంక్షేమం వివరించేందుకు వచ్చేనెల 2 నుంచి ప్రజల్లోకి వెళ్లాలని టీడీపీ సీనియర్ నాయకుడు, ఎన్నికల పరిశీలకుడు గన్ని కృష్ణ అన్నారు. శనివారం స్థానిక లలీఫన్స్ కల్యాణ మండపంలో కూటమి ఏడాది పాలన తొలి అడుగు ప్రత్యేక సమావేశం వాసంశెట్టి సత్యం అధ్యక్షతన జరిగింది. సమావేశంలో నూతనంగా ఎన్నికైన మండల, పట్టణ కమిటీ, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు, గ్రామ, వార్డు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులను పరిచయం చేశారు. సమావేశంలో గన్నికృష్ణ, నియోజకవర్గ పరిశీలకుడు రామా రావు తదితరులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందించిందన్నారు. సమావేశంలో బీసీ సెల్ నాయకుడు పెంకె సాంబశివరావు, సీనియర్ నాయకులు గరిగిపాటి సూర్యనారాయణ మూర్తి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయ లక్ష్మి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విజయాలను ప్రజలకు తెలపండి

కార్యకర్తలకు ఎమ్మెల్యే వేగుళ్ల వినతి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూన్, 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు చేరవేసే బాధ్యత కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. టీడీపీ పట్టణ కార్యాలయంలో జరిగిన టీడీపీ కార్యకర్తలు, బూత్, వార్డు గ్రామ, ఇన్‌చార్జీల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఇప్పటి వరకు సాధించిన విజయాలు, భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలను ఇంటింటా కార్యకర్తలు తెలియ చేయాలన్నారు. ఇళ్లను సందర్శించినప్పుడు మైటీడీపీ యాప్‌లో నమోదు చేయాలని కోరారు. యాప్ వినియోగంపై అమలాపురం పార్లమెంట్ కన్వీనర్ పలివెల ప్రకాష్ వివరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మందపల్లి దొరబాబు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మచ్చా నాగు, ఏఎంసీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, వాదా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అంగర వెంకన్న ఆలయానికి భూ విరాళం

కపిలేశ్వరపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న వైభవ వెంకటేశ్వరస్వామి (వెంకన్న) ఆలయానికి గ్రామానికి చెందిన దివంగత పడాల మధ్యాహ్నం ధర్నపత్రి చంద్రం 0.50 సెంట్ల భూ విరాళం అందించడం ఆమె దాతృత్వానికి నిదర్శనమని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ రెడ్డి ప్రసాద్, జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు అన్నారు. శనివారం వెంకన్న ఆలయ ప్రాంగణంలో దాసరి చిన్నరాజా అధ్యక్షతన జరిగిన స్థలదాత చంద్రం సన్మానసభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ఆమె దాతృత్వాన్ని ప్రశంసించారు. సుమారు అరకోటి విలువ చేసే భూవిరాళాన్ని సామాన్య కుటుంబానికి చెందిన గృహిణి అందించడం సామాన్య విషయం కాదని ఆలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి పెద్దింశెట్టి రామస్వామి, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీలు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, మాజీ ఎంపీటీసీ అంగర రామనరసింహారావు తదితరులు పేర్కొన్నారు. అనంతరం స్థలదాత చంద్రంను ఆలయ కమిటీ, గ్రామస్థులు, ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సూరంపూడి వెంకట్రావు, శంకర్రావు, ఉపసర్పంచ్ యర్రా వీరన్నబాబు, మాజీ సర్పంచ్ సంకాబత్తుల స్వామికాపు, జనసేన నాయకులు పిల్లా బసవరాజు తదితరులతో పాటు కుటుంబ సభ్యులు, అంగర, పడమరఖండ్రిక గ్రామాల ప్రజలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు నిర్మించరూ...

• బడుగువానిలంక రైతులు, వాహనదారుల వినతి • చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం


అధ్వానంగా ఉన్న బడుగువానిలంక అప్రోచ్ రోడ్డు

ఆలమూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం బడుగువానిలంక వంతెన అప్రోచ్ రోడ్డు అధ్వానంగా మారడంతో ఆయా గ్రామాల రైతులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై పాలకులు దృష్టిసారించాలని ఆయా లంక గ్రామాల రైతులు మొరపెట్టుకుంటున్నారు. ఈ వంతెన నిర్మాణం మొదలుపెట్టి దాదాపు రెండు దశాబ్దాలు కావస్తున్నది. అప్పటి నుంచి దీని నిర్మాణం దశల వారీగా సాగింది. ఎట్టకేలకు 2019లో వంతెన ప్రారంభించారు. అప్పట్లో అప్రోచ్ రోడ్డు నిర్మాణం మొక్కుబడిగా చేసి వదిలేయడంలో అప్రోచ్ వర్షాలకు జారిపోతోంది. దీంతో రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలాది ఎకరాల్లోని వాణిజ్య పంటలు ఈ వంతెన మీదుగా మార్కెట్‌కు తరలించాల్సి ఉంది. బడుగువానిలంక గ్రామస్థులకు, వాహనదారులకు ఇదే మార్గం. బడుగువానిలంక, చెముడులంక, చొప్పెల్ల, మడికి, ఆత్రేయపురం లంక భూముల్లోని వేలాది ఎకరాల్లో ఉన్న వాణిజ్య పంటలు ఈ వంతెన మీదుగా రవాణా సాగించాల్సి ఉంది. లంక భూముల్లోని కూరగాయలు, పూలతోటలతోపాటు అరటి, కంద వంటి అనేక వాణిజ్య పంటలు నిత్యం మార్కెట్‌కు తరలిస్తుంటారు. అప్రోచ్ రోడ్డు సరిగా లేకపోవడంతో వాహనాలు జారిపోయి తరచూ ప్రమాదాల బారిన పడుతున్నామని వారు ఆరోపిస్తున్నారు. రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి అప్రోచ్ రోడ్డుకు నిధులు కేటాయింపు చేసి అప్రోచ్‌ను సక్రమంగా చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ వంతెనతోపాటే మూలస్థానం వంతెన నిర్మాణం చేపట్టారు. కాగా ఇటీవల ఈ వంతెనకు అప్రోచ్ నిర్మాణం చేశారని, అదే విధంగా బడుగువానిలంక వంతెన అప్రోచ్‌ను కూడా చేపట్టాలని వారు రైతులు, వాహనదారులు కోరుతున్నారు.


ఆర్థికసాయం చెక్కు అందచేస్తున్న మంత్రి సుభాష్

పేద కుటుంబానికి మంత్రి సుభాష్

ఆర్థికసాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రామచంద్రపురం మండలం తాళ్లపొలం గ్రామానికి చెందిన టేకుమూడి రాముకు మంత్రి సుభాష్ రూ.20 వేలు ఆర్థికసాయం అందచేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని కూటమి నాయకుల ద్వారా తెలుసుకున్న మంత్రి సుభాష్ శనివారం అతన్ని పరామర్శించారు. మెరుగైన వైద్యం నిమిత్తం తక్షణ ఖర్చులకు రూ.20 వేల చెక్కును అందచేశారు.


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల

అన్న క్యాంటీన్ తనిఖీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలోని అన్న క్యాంటీన్‌ను శనివారం ఆర్డీవో దేవరకొండ అఖిల తనిఖీ చేశారు. క్యాంటీన్‌లోని ఆహార పదార్థాలను ఆమె పరిశీలించారు. అన్న క్యాంటీన్‌లో లబ్ధిదారులతో మాట్లాడారు. భోజనం నాణ్యత, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లో రూ.5లకే అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించడం ఆషామాషీకాదన్నారు. ఆమె వెంట తహసీల్దార్ మృత్యుంజయరావు పాల్గొన్నారు.

డ్వాక్రా యానిమేటర్ మృతి

ఆలమూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారంలోని డ్వాక్రా యానిమేటర్ దొండపాటి సువర్ణ (40) శనివారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం పట్ల మండల వెలుగు ఏపీఎం ధనరాజు, డ్వాక్రా యానిమేటర్ల మండల సంఘం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

కె.గంగవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఉదయం ఆయన పలు గ్రామాల్లో పర్యటించి చెత్త సేకరణను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.


రాయితీపై పాడి రైతులకు దాణాను అందజేస్తున్న కూటమి నాయకులు

పాడి రైతులు ప్రభుత్వ పథకాలను

సద్వినియోగం చేసుకోవాలి

కె.గంగవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు వెంటూరు వీర్రాఘవులు చౌదరి అన్నారు. శనివారం కోటిపల్లి, కోట గ్రామాలకు చెందిన రైతులకు రాయితీపై మంజూరైన దాణాను అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యురాలు సంయుక్త, కూటమి నాయకులు కర్రి చిట్టిబాబు, గొడవర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

మండపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈనెల 30న సోమవారం ఉదయం కౌన్సిల్ హాల్‌లో జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతీవాడ నూకదుర్గారాణి ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటి వద్దకే రేషన్ పంపిణీ

రాయవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు రేషన్ తెచ్చుకునేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం ఐదు రోజులు ముందుగా ఇంటి వద్దకే రేషన్ పంపిణీకి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జూలైకి సంబంధించి 65 ఏళ్లు దాటిన వారికి ఇళ్ల వద్దకే పంపిణీ చేయాలని నిర్ణయించి ప్రతినెలా 26వ తేదీ నుంచి 30 లోపు పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించింది. మండలంలో ఆయా గ్రామాల్లో 26న పంపిణీ ప్రారంభమైంది.

30లోపు పంపిణీ పూర్తి చేసేలా చర్యలు: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా గ్రామాల పరిధిలో వృద్ధులు, దివ్యాంగుల జాబితాను అందజేశాం. అందుకు అనుగుణంగా 26వ తేది నుంచి సరకుల పంపిణీ ప్రారంభంకాగా 30వ తేదీలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహశీల్దారు ఐపీ శెట్టి తెలిపారు. మండలంలో 3071 మందికి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేస్తున్నట్టు ఎంఎస్‌వో పద్మ తెలిపారు.


మాచవరంలో ఇంటి వద్ద వృద్ధుడికి రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏటా కోటిన్నర ఖర్చవుతున్నా ప్రజలకు రక్షిత మంచినీరు ఏది?

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ధ్వజం


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ బోస్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు రక్షిత మంచినీటి పథకానికి ఏటా కోటిన్నర వరకు ఖర్చుచేస్తున్నారని అయినా రక్షిత మంచినీరు అందడం లేదని పలువురు కౌన్సిలర్లు మండిపడ్డారు. శనివారం రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో 4వ అంశం వెల్ల రక్షిత మంచినీటి ప్రాజెక్టుకు రూ.1.53 కోట్లు కేటాయింపుపై కౌన్సిలర్ వాడ్రేవు సాయి ప్రసాద్, వైస్ చైర్మన్ కొలమూరి శివాజీ మాట్లాడుతూ ఏటా కోటిన్నర ఖర్చు చేస్తున్నా ఎందుకు ప్రజలకు రక్షిత మంచినీరు సక్రమంగా ఇవ్వలేక పోతున్నామని ప్రశ్నించారు. దీనిపై డీఈ శ్రీకాంత్ మాట్లాడుతూ రక్షిత మంచినీరు అందడం లేదన్నది వాస్తవం కాదన్నారు. దీనిపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన కౌన్సిలర్ అంకం శ్రీనివాస్ రక్షిత మంచినీరు రావడం లేదన్నది వాస్తమన్నారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు రక్షితనీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టు నిర్మించామని పటిష్టచర్యలు తీసుకుని రక్షిత మంచినీరు అందించాలని కోరారు. కోర్టు పరిధిలో ఉన్న విజయదుర్గనగర్‌లో రూ.2.77 కోట్ల కేటాయింపుపై కౌన్సిలర్లు కేతా శ్రీను, బొక్కా సత్యనారాయణ, పెంటపాటి శ్రీను, వాడ్రేవు సాయి ప్రసాద్, కో ఆప్షన్ సభ్యుడు మస్తాన్‌లు అభ్యంతరం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్, కమిషనర్, ఇంజనీరింగ్‌శాఖ అధికారులు కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించి నిధులు కేటాయిస్తే సమస్యలు రావన్నారు. దీంతో 14వ అంశంలో మొత్తం పనులు, 11వ అంశంలో 2, 5 పనులు రద్దు చేస్తున్నట్లు చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి తెలిపారు. తన వార్డులో పని రద్దు చేయడం పట్ల కౌన్సిలరు బావాల మంగామణి అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుబజార్ పక్క ఖాళీ స్థలంలో సీఎస్ఆర్ నిధులతో నెట్ క్రికెట్, ఓపెన్ జిమ్, పిరమిడ్ ధ్యాన కేంద్రం, మహిళల చిన్నతరహా వ్యాపారాలు, షాపుల నిర్మాణానికి కౌన్సిలర్లు వాడ్రేవు సాయిప్రసాద్, వైస్ చైర్మన్ శివాజీ అభ్యంతరం తెలిపారు.

ఎంపీ బోస్ ఇదే ప్రాంతంలో కల్యాణమండపం నిర్మాణానికి అంచనాలు తయారు చేయించారని డీనోటిపై చేయలేదన్నారు. కల్యాణ మండపంతో పాటు ప్రతిపాదిత పనులు చేపట్టడానికి ఆమోదం తెలిపారు. బస్ కాంప్లెక్సు వద్ద శ్మశానవాటిక అభివృద్ధికి రూ.25 లక్షలు కేటాయిస్తూ తీర్మానించారు. దీనిపై జనసేన కౌన్సిలర్ అంకం శ్రీను కృతజ్ఞతలు తెలిపారు. సమావేశానికి ముందు వైసీపీ కౌన్సిలర్లు మెప్మా ఆధ్వర్యంలో ట్యాబ్‌ల పంపిణీలో ప్రొటోకాల్ పాటించలేదని నల్లబ్యాడ్జీలు, ప్లకార్డులతో నిరసన తెలిపారు. దీనిపై కమిషనర్ రాజు విచారం వ్యక్తం చేయడంతో కౌన్సిలర్లు సమావేశంలో పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

కపిలేశ్వరపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య ఆరోగ్య సిబ్బంది మెరుగైన సేవలందించాలని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అన్నారు. శనివారం అంగర పీహెచ్‌సీలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. హెచ్‌డీఎస్ చైర్మన్ సత్యవేణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హెచ్‌డీఎస్ కన్వీనర్ డాక్టర్ రత్నకుమారి, కమిటీ సభ్యులుగా ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి పాల్గొన్నారు. సమావేశంలో పలు సమస్యలను పరిష్కరించే విధంగా తీర్మానించారు. సమావేశంలో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, తదితరులతో పాటు పలువురు నాయకులు, ఆసుపత్రి వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

పారిశుధ్య పనుల పరిశీలన

కపిలేశ్వరపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అంగర గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్ శనివారం పరిశీలించారు. ప్రత్యేక పారిశుధ్యంలో భాగంగా మంగళ, గురువారాల్లో తడిపొడి చెత్త, హానికరమైన చెత్తలను వేరుగా సేకరించే కార్యక్రమంపై ఆయన పర్యవేక్షించి పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్.మోహన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

కె.గంగవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి) మండలంలోని పాణింగపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం 1, 2 తరగతుల విద్యార్థులకు పలకలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు సత్తిరాజు కుమార్తె అక్షరాభ్యాసాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు వీటిని సమకూర్చారు. ఎంఈవో2 చోడిశెట్టి అంజనేయులు వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేడిశెట్టి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు అందజేత

మండపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలతోపాటు నాణ్యమైన విద్యను టీచర్లు బోధిస్తారని కూటమినేతలు అన్నారు. ద్వారపూడి జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ విద్యార్థినులకు శనివారం ప్రభుత్వం అందించిన యూనిఫామ్‌ను కూటమినేతలు విద్యార్థినులకు అందజేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ మురళీకృష్ణ, కూటమి నాయకులు పల్ల బాబు, తొంటా శ్రీనివాసరావు, అడబాల బుల్లబ్బు, చింతా శ్రీను, అత్తిలి యేసురాజు, హెచ్‌ఎం రాజరాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

మండపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యార్థి దశ నుంచి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తాపేశ్వరం శ్రీచైతన్య ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. తాపేశ్వరం శ్రీచైతన్య పాఠశాలలో శనివారం గ్రీన్ ఇండియా మిషన్‌లో భాగంగా విద్యార్థులు వంద మొక్కలను పాఠశాల ప్రాంగణ పరిసరాల్లో నాటారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాయవరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆషాడమాసం శనివారాన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, మహావేదన నిర్వహించారు. రాయవరం పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు.

నేడు జిల్లాలో విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

జిల్లా ఎస్‌ఈ రాజబాబు

మండపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు వీలుగా జిల్లాలోని బిల్లుల చెల్లింపు కేంద్రాలు ఆదివారం కూడా తెరచి ఉంటాయని విద్యుత్ శాఖ జిల్లా ఎస్‌ఈ రాజబాబు తెలిపారు. విద్యుత్ కార్యాలయాలతోపాటు ఏటీపీ సెంటర్లలో కూడా విద్యుత్ బిల్లులు యథావిధిగా చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని శనివారం ఒక ప్రకటనలో ఆయన కోరారు.


పోగొట్టుకున్న వారికి సెల్‌ఫోన్లను అందిస్తున్న సీఐ శేఖర్‌బాబు

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత

రావులపాలెం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రావులపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో పలువురు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్టు సీఐ శేఖర్‌బాబు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాట్‌బోర్డు ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మొబైల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. రికవరీ చేసిన రూ.3లక్షల విలువైన ఏడు మొబైల్‌ఫోన్లను బాధితులకు అందచేశారు. సెల్‌ఫోన్లను రికవరీ చేయడంలో కృషి చేసిన సిబ్బంది త్రిమూర్తులు, శ్రీను, నాయుడులను సీఐ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అశోక్, బ్లెసన్‌కు నివాళి

ఆలమూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల విధి నిర్వహణలో మృతి చెందిన ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్, కానిస్టేబుల్ బ్లెసన్‌లకు శనివారం నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎ.రాజు అధ్యక్షతన సంతాప నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్, బ్లెసన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, డీసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామి, నాయకులు ఈదల నల్లబాబు, ఈదల రాంబాబు, నెక్కంటి సూర్యప్రకాశరావు, షరీఫ్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


బీజేవైఎం జాతీయ అధ్యక్షుడిని కలిసిన చిన్నారి

బీజేవైఎం బలోపేతానికి కృషి చేయాలి

ఆత్రేయపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా యువమోర్చా జాతీయ అధ్యక్షుడు బెంగళూరు సౌత్ ఎంపీ తేజస్వి సూర్యను, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి చాయ్‌విత్ తేజస్వి సూర్య కార్యక్రమంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో బీజేపీ యువమోర్చా బలోపేతానికి దిశానిర్దేశం చేసినట్లు ఆమె తెలిపారు.

ఆరోగ్య సూత్రాలపై అవగాహన

ఆత్రేయపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆహార అలవాట్లు, ఆరోగ్య సూత్రాలు తప్పనిసరిగా పాటించాలని వేదీ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ పోతుమూడి శేషారత్నం పేర్కొన్నారు. శనివారం ర్యాలిలో వేదీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళల జీవనశైలి, శుభ్రత, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలంటూ ర్యాలీ నిర్వహించారు.


మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఒప్పంద కార్మికులు

మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

మండపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని కాంట్రాక్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని వారన్నారు. రిలే నిరాహారదీక్ష శిబిరంలో కాంట్రాక్ట్ కార్మికుల సంఘ అధ్యక్షుడు సుబ్బరాజు నేతృత్వంలో కార్మికులు కప్పల అన్నవరం, సురేష్, పిట్టా ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో రాజుకు సత్కారం

ఆలమూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): యోగా కార్యక్రమాల నిర్వహణలో కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించిన ఎంపీడీవో ఎ.రాజును మండల డ్వాక్రా యానిమేటర్లు సత్కరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డ్వాక్రా యానిమేటర్లు సమావేశంలో ఆయన్ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మండల ఏపీఎం ధనరాజు, మండల డ్వాక్రా యానిమేటర్లు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.